




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 275, పేజీలు - 08

సోమవారం, మార్చి 23, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD









## మా ప్రభుత్వం
# రైతు పక్షపాతి

- రైతు భరోసా పథకం కింద తొలి విడత నిధులు విడుదల
- మొత్తం రూ. 9,000 కోట్లలో.. తొలి విడతగా రూ. 3,590 కోట్లు విడుదల
- సోమవారం రైతుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు
- -ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు ఆపబోమని సీఎం రేవంత్ హామీ
- పంట మార్పిడి అవసరమని రైతులకు సూచించిన ముఖ్యమంత్రి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేసింది. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో జరిగిన బహిరంగ సభ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను అధికారికంగా విడుదల చేశారు. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను నేటి నుంచి ప్రారంభించింది. 70 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. అయితే 45 రోజుల్లోగా రైతుల ఖాతాల్లోకి నగదు జమ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. గత కొంతకాలంగా పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న కోట్లాది మంది రైతులకు ఈ నిర్ణయం పెద్ద ఊరటనిచ్చింది. సాగు పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో, ఆర్థిక ఇబ్బందులు లేకుండా

2లో..



## ప్రధాని మోదీ అరుదైన ఘనత

- అత్యధిక కాలం ప్రభుత్వ అధినేతగా రికార్డ్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన ఘనత సాధించారు. దేశ చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం పాటు ఎన్నికైన ప్రభుత్వ అధినేతగా సేవలందించిన నరేంద్ర మోదీ ఒక గొప్ప రాజకీయ మైలురాయిని చేరుకున్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ఆయన పదవీకాలాన్ని కలిపి చూస్తే, పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న సుదీర్ఘకాల రికార్డును మోదీ అధిగమించారు. ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక అద్భుతమైన ఘట్టంగా చెప్పవచ్చు.

### అగ్రస్థానంలో నరేంద్ర మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు అధికారంలో మొత్తం 8931 రోజుల పదవీకాలంతో మొదటి స్థానంలో ఉన్నారు. ఆయన ప్రస్థానం గుజరాత్ ముఖ్యమంత్రిగా 2001లో ప్రారంభమైంది. ఆ పదవిలో ఆయన 2014 వరకు కొనసాగారు. ఆ తర్వాత జాతీయ నాయకత్వం వైపు అడుగులు వేసిన ఆయన 2014లో భారత ప్రధానమంత్రి అయ్యారు. ఇప్పటికీ ఆయన ఆ పదవిలోనే

2లో..

# అవమానాలు ఇక చాలు

- కాంగ్రెస్ పార్టీని వీడనున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి
- పార్టీలో అవమానాలు భరించలేకే ఈ నిర్ణయమన్న సీనియర్ నేత
- ఈ నెల 25న పార్టీకి రాజీనామా చేయనున్నట్లు వెల్లడి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలతో తీవ్ర అసంతృప్తిగా ఉన్న సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పేందుకు తాను పెట్టుకున్న ముహుర్తాన్ని వెల్లడించారు. అలాగే భవిష్యత్తు రాజకీయంపైనా ఆయన క్లారిటీ ఇచ్చేశారు. దీంతో గత కొద్ది రోజులుగా జీవన్ రెడ్డిపై జరుగుతున్న ప్రచారాలకు చెక్ పడినట్లయింది. అదే సమయంలో ఆయన కాంగ్రెస్ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి తాను ఈ నెల 25న రాజీనామా చేయబోతున్నట్లు జీవన్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు జగిత్యాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆయన ఓ బహిరంగ లేఖ రాశారు. ఇందులో ఆయన కాంగ్రెస్ లో కొనసాగలేనంటూ

2లో..



## అమరావతిలో నివసించే వారు 20 ఏళ్లు ఎక్కువ జీవిస్తారు

- ఐఎస్‌బి సౌత్ ఏషియా లెర్నింగ్ మీట్ లో సీఎం చంద్రబాబు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి రేటును 15 శాతానికి చేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో జరిగిన 'సౌత్ ఏషియా లెర్నింగ్ మీట్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా, అమరావతిని ప్రపంచంలోనే ఓ అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని, అక్కడ నివసించే వారు మిగతా వారికంటే 20 ఏళ్లు ఎక్కువ జీవించేలా

2లో..

## అభివృద్ధిపై ఉన్న అతి శ్రద్ధ వల్ల
# బ్యాలెన్స్ కోల్పోయాను

- ఐఎస్బీ సదస్సులో ప్రసంగించిన ఏపీ సీఎం చంద్రబాబు

- బంజరు భూమిగా ఉన్న హైదరాబాద్‌ను నాలెడ్జ్ హబ్‌గా మార్చిన విధానం వెల్లడి
- అభివృద్ధి చేసినా రాజకీయంగా ఎదురైన ఓటములు, నేర్పిన పాఠాల ప్రస్తావన
- అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో ఏపీ భవిష్యత్‌కు బలమైన పునాది వేశామని వివరణ
- సంపద సృష్టితో పాటు సమాజ సేవ కూడా ముఖ్యమని పారిశ్రామికవేత్తలకు పిలుపు



అమరావతి (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బీ)లో జరిగిన సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్-2026 కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'ది ఫ్యూచర్ ఆఫ్ ఎవ్రీథింగ్' అనే అంశంపై ప్రసంగించారు. ఒకప్పుడు బంజరు భూమిగా ఉన్న హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలిపిన తన ప్రస్థానాన్ని, రాజకీయంగా ఎదురైన

2లో..

## ఇక్రిశాట్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
# అవగాహన రాహిత్యం

- తెలంగాణ పరువు తీయొద్దన్న హరీశ్ రావు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాలుగా అంతర్జాతీయ ఖ్యాతి పొందిన ఇక్రిశాట్ ను అమెరికాకు చెందిన సంస్థగా సీఎం అభివర్ణించడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. కనీస వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడి తెలంగాణ పరువు తీయవద్దని హితవు పలికారు. ఈ మేరకు హరీశ్ రావు ఒక ప్రకటన విడుదల చేశారు. 1972 నుంచి పటాన్‌చెరు కేంద్రంగా పనిచేస్తున్న ప్రపంచ ప్రఖ్యాత సంస్థ గురించి కూడా సీఎంకు స్పష్టత లేకపోవడం బాధాకరమన్నారు. ఇక్రిశాట్ అనేది ఏ ఒక్క దేశానికీ చెందినది కాదని, అది ఒక స్వతంత్ర, లాభాపేక్ష లేని అంతర్జాతీయ పరిశోధనా

2లో..

## సిద్ధిపేట జిల్లాలో ఆయిల్ పాం
# ఫ్యాక్టరీ ప్రారంభం

- జిల్లా మొత్తం 775 కోట్ల పనులకు సీఎం రేవంత్ శ్రీకారం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజా పాలనలో రైతు ఉత్సవాలు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదివారం (మార్చి 22న) సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో పర్యటించారు. అక్కడ రూ. 300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ప్రారంభించి రాష్ట్ర రైతులకు అంకితం చేశారు. దీనితో పాటు రిఫైనరీ యూనిట్ నిర్మాణానికి కూడా ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నిధులను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ. 775.72 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆయన మంత్రులతో కలిసి శ్రీకారం చుట్టారు.

### సిద్ధిపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం..

సిద్ధిపేట నియోజకవర్గ పరిధిలో విద్యా, వైద్య, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ పలు భవనాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఇందులో రూ. 141.34 కోట్లతో సిద్ధిపేట మున్సిపాలిటీలో నీటి సరఫరా, డ్రైనేజీ ప్రాజెక్టులు, రూ. 78 కోట్లతో ఎన్సాన్‌పల్లిలో జిల్లా జైలు భవనం, రూ. 15 కోట్లతో 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రి ముఖ్యమైనవి ఉన్నాయి. వీటితో పాటు సెంట్రల్ మెడిసిన్ స్టోర్, నంగునూరు, అంబేద్కర్

2లో..

## యుద్ధం వేళా
# మోదీ కీలక భేటీ

- పెట్రోలియం, గ్యాస్, విద్యుత్, ఎరువుల సరఫరాపై ఉన్నతస్థాయి సమీక్ష



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రస్తుతం పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్, అమెరికా కలిసి ఇరాన్‌పై భీకర దాడులు చేస్తుండగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై తమదైన శైలిలో దాడులు చేస్తోంది. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రపంచ చమురు రవాణాకు కీలకంగా ఉన్న హర్మూజ్ జలసంధి ఇరాన్ ఆధీనంలో ఉండగా అక్కడి నుంచి చమురు సరఫరాలో

2లో..

## హర్మూజ్ తెరిచే ఉంది

- ట్రంప్ అల్టిమేటానికి ఇరాన్ కౌంటర్



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) హర్మూజ్ జలసంధిని అన్ని దేశాల నౌకల కోసం తెరిచే ఉంచామని, అయితే తమ శత్రు దేశాలకు చెందిన నౌకలను మాత్రం అనుమతించబోమని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 48 గంటల అల్టిమేటం నేపథ్యంలో టెహ్రాన్ ఈ కీలక ప్రకటన చేసింది. సమన్వయంతో ముందుకు వచ్చే ఇతర దేశాల నౌకలు సురక్షితంగా ప్రయాణించవచ్చని తెలిపింది. అంతర్జాతీయ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఓ)లో ఇరాన్ సీనియర్ ప్రతినిధి అలీ మౌసావి ఈ విషయాలను వెల్లడించారు. జలసంధిలో ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులకు అమెరికా,

2లో..

# కేబినెట్‌లోకి కొత్త నేతలు

- మంత్రివర్గ విస్తరణకు హైకమాండ్ చర్చలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లో మార్పులు జరగనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన విషయంలో కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కేబినెట్‌లో కొనసాగుతున్న మంత్రుల్లో ఒకరు, లేదా ఇద్దరిని తప్పించి వారి స్థానంలో కొత్త వారిని తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం.

2లో..



# అభివృద్ధిపై ఉన్న అతి శ్రద్ధ వల్ల బ్యాలెన్స్ కోల్పోయాను

సవాళ్లను, భవిష్యత్ ఆంధ్రప్రదేశ్ కోసం తనకున్న దార్శనికతను ఆయన పారిశ్రామికవేత్తలతో పంచుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనేవి మూడు కీలక స్తంభాలని, వీటిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

### బంజరు భూమి నుంచి భాగ్యనగరంగా

1995లో తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించేనాటికి హైదరాబాద్, సికింద్రాబాద్ అనే జంట నగరాలు మాత్రమే ఉన్నాయని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, బిల్ గేట్స్ తీసుకొచ్చిన ఇంటర్నెట్ విప్లవాన్ని గమనించి, భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీదే అని తాను దృఢంగా విశ్వసించానని తెలిపారు. అప్పట్లో సైబరాబాద్ ప్రాంతం మొత్తం పాములు, ముళ్లపొదలతో నిండిన బంజరు భూమి అని, అక్కడ హైటెక్ సిటీ నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థ మొదట వెనకాడిందని చెప్పారు. అయితే, వారిని ఒప్పించి పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో కేవలం 15 నెలల్లోనే ఆ అద్భుత కట్టడాన్ని పూర్తి చేశామని వివరించారు. ఆ తర్వాత బిల్ గేట్స్‌ను కలిసి, కేవలం 10 నిమిషాల అపాయింట్‌మెంట్‌లో 45 నిమిషాల పాటు చర్చించి, భారతీయుల ప్రతిభను వివరించి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రం ఏర్పాటుకు ఒప్పించానని, ఆ రోజు తాను వేసిన పునాది వల్లే ఈ రోజు హైదరాబాద్ ఐటీ హబ్‌గా విలసిల్లుతోందని అన్నారు.

### ఐఎస్బీ, విమానాశ్రయం.. హైదరాబాద్‌కు కొత్త రూపు

హైదరాబాద్‌కు ఐఎస్బీని తీసుకురావడానికి తాను పడిన శ్రమను చంద్రబాబు వివరించారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలు కలిసి ముంబై, బెంగళూరు, చెన్నైలలో ఐఎస్బీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలియగానే, తాను వెంటనే వారిని సంప్రదించి హైదరాబాద్‌కు ఆహ్వానించానని తెలిపారు. వారిని ఒప్పించడానికి తన మంత్రివర్గ సహచరులను విమానాశ్రయానికి పంపి, తానే స్వయంగా వారికి అల్పాహారం వడ్డించానని గుర్తు చేసుకున్నారు. మిగతా నగరాలు ఇచ్చే ఆఫర్ల కన్నా "బెస్ట్ ప్లస్ వన్" ఇస్తానని ఒక్క మాటతో హామీ ఇచ్చానని, తన చిత్తశుద్ధిని నమ్మి వారే హైదరాబాద్‌లో ఐఎస్బీ ఏర్పాటుకు ముందుకొచ్చారని చెప్పారు. అలాగే, చిన్నగా ఉన్న బేగంపేట విమానాశ్రయానికి ముందుగా ట్రాఫిక్ పెంచి, ఆ తర్వాత 5,000 ఎకరాల్లో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా నిర్మించామని తెలిపారు.

### అభివృద్ధి చేసినా.. రాజకీయంగా ఎదురుదెబ్బలు

ఎంత అభివృద్ధి చేసినప్పటికీ, రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజమని చంద్రబాబు అన్నారు. 1999 నుంచి 2004 వరకు హైదరాబాద్ అభివృద్ధికి ఎన్నో పనులు చేసినా, 2004 ఎన్నికల్లో ఓటమి పాలయ్యానని అంగీకరించారు. "అభివృద్ధిపై ఉన్న అతి శ్రద్ధ వల్ల బ్యాలెన్స్ కోల్పోయాను. కేవలం అభివృద్ధి చేస్తే సరిపోదు, రాజకీయాలను కూడా చూసుకోవాలని ఆ ఓటమి నాకు నేర్పింది" అని ఆయన వ్యాఖ్యానించారు. పదేళ్ల తర్వాత 2014లో అధికారంలోకి వచ్చినా, రాష్ట్ర విభజన తర్వాత మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వచ్చిందని అన్నారు. 2019లో మరోసారి ఓటమి ఎదురైందని, ఈ అనుభవాలు తనను మరింత రాటుదేల్చాయని తెలిపారు.

### విభజన తర్వాత.. స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా

2024లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, ఇప్పుడు తన ముందున్న ఏకైక లక్ష్యం "స్వర్ణాంధ్ర ప్రదేశ్" నిర్మాణమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని, దానిని తిరిగి పునర్నిర్మించే పనిలో ఉన్నానని చెప్పారు. గత 21 నెలల్లోనే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, దీని ద్వారా 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని వివరించారు. గూగుల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో భారీ డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయని, అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు. విజన్ 2047 డాక్యుమెంట్ సిద్ధం చేశామని, వచ్చే 15 ఏళ్ల పాటు ఏటా 15% వృద్ధి రేటు సాధించి, 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని అన్నారు.

### అమరావతి, పోలవరం.. ఏపీకి జీవనాధారాలు

అమరావతి కేవలం రాజధాని కాదని, అది ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు అని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 29,000 మంది రైతులు స్వచ్ఛందంగా 33,000 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేసిందని, ఇప్పుడు మళ్లీ పనులు వేగవంతం చేశామని తెలిపారు. "అమరావతిని హైదరాబాద్ ప్లస్ సిటీగా, ప్రపంచంలోనే అత్యుత్తమ నివాసయోగ్య నగరాల్లో ఒకటిగా నిర్మించి తీరుతా" అని భరోసా ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్రానికి జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆ మరమ్మతులు పూర్తిచేసి, వచ్చే ఏడాదికల్లా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు.

### సంపద సృష్టితో పాటు.. సమాజ సేవ ముఖ్యం

పారిశ్రామికవేత్తలు సంపద సృష్టితో పాటు సామాజిక బాధ్యతను కూడా విస్మరించవద్దని చంద్రబాబు పిలుపునిచ్చారు. తాను గతంలో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీ3) మోడల్‌ను ప్రోత్సహించానని, ఇప్పుడు సమాజంలోని అసమానతలను తగ్గించడానికి పీ4 (పీపుల్-పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్ షిప్ ఫర్ ఫిలంత్రోఫీ) మోడల్‌ను ముందుకు తెస్తున్నానని చెప్పారు. "ఎంబికె 10-20" అనే కార్యక్రమాన్ని ప్రతిపాదిస్తున్నానని, అంటే "మార్గదర్శి-బంగారం" అని అర్థమని వివరించారు. సమాజంలోని ఉన్నత వర్గాల్లోని 10% మంది, అట్టడుగున ఉన్న 20% కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. డబ్బు ఇవ్వడమే కాకుండా, వారికి మార్గనిర్దేశం చేసి చేయూతనివ్వడం ద్వారానే నిజమైన సంతృప్తి లభిస్తుందని హితవు పలికారు.

# మా ప్రభుత్వం రైతు పక్షపాతి

రైతులు తమ పంటలను సాగు చేసుకోవాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసింది. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి 300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ప్రారంభించి రైతులకు అంకితం చేశారు. మొత్తం 775 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకట్ స్వామి, టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.

### - 3,600 కోట్లు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'సన్న బియ్యానికి రూ.500 బోనస్ ఇచ్చిన ప్రభుత్వం మాది. ఇప్పుడు రైతులకు పంట పెట్టుబడి సాయం కోసం రైతు భరోసా నిధుల విడుదలకు శ్రీకారం చుట్టాం. తొలి విడతగా 70 లక్షల మంది రైతులకు రూ.3600 కోట్లు ప్రయోజనం చేకూరనుంది. రేపటిలోగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అవుతాయి. మిగిలిన 5400 కోట్ల రూపాయల్లో 20 రోజుల్లో 2700 కోట్లు, ఇంకో 20 రోజుల్లో 2700 కోట్లు రైతుల ఖాతాలో ఎకరానికి రూ.6000 చొప్పున మొత్తం 9000 కోట్లు రైతు భరోసా నగదు జమ చేస్తాం. మొత్తం 45 రోజుల్లోగా ప్రక్రియ పూర్తవుతుందని' అన్నారు. తమ ప్రభుత్వం రైతు పక్షపాతి అని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా నిధులను ఎలాంటి ఆటంకాలు లేకుండా నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి (డీబీటీ) చేరుస్తున్నామని స్పష్టం చేశారు. ఈ రూ. 9,000 కోట్ల విడుదల ద్వారా రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులతో పాటు కౌలు రైతులకు కూడా మేలు చేకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఉన్న లోపాలను సవరించి, అర్హులైన ప్రతి రైతుకు ఈ సాయం అందేలా పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నిధుల జమ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేశారు. 'బీఆర్ఎస్ హయాంలో 114 నెలలు సీఎం కేసీఆర్ రైతులకు సరాసరి ఖర్చు 2533 కోట్లు. నేడు మన ప్రభుత్వం 28 నెలలైతే ప్రతినెల సరాసరి రూ.5500 కోట్లు ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ రైతులకు ఉచిత విద్యుత్, సన్నవడ్లకు బోనస్, రుణమాఫీ, రైతు భీమా, రైతు భరోసా లాంటి వాటికి కాంగ్రెస్ ప్రభుత్వం వెనకడుకు వేయకుండా ఖర్చు చేస్తున్నాం. ఇప్పటివరకూ రైతులకు లక్షా 30 వేల కోట్లకు పైగా రైతు సంక్షేమం కోసం ఖర్చుపెట్టాం. వరి పండించడంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది 2.58 కోట్ల మెట్రిక్ టన్నులతో నెంబర్ వన్‌గా నిలిచాం. మెదక్, నిజామాబాద్ రైతులకు ఓ రిక్వెస్ట్ చేస్తున్నాం. ఈ ప్రాంతంలో నిజాం ఫ్యాక్టరీ నడిచింది. పసుపు, మొక్కజొన్నలు, చెరుకు లాంటివి గతంలో బాగా పండించారు. ఇప్పుడు పామాయిల్ పంట 3 లక్షల ఎకరాలకు చేరింది. 10 లక్షల ఎకరాలకు పండించినా కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

### - పంట మార్పిడి చేయాల్సిన అవసరం వచ్చింది

ఖమ్మం, వరంగల్ జిల్లాలో పత్తి, మిర్చి బాగా పండుతుంది. నల్గొండలో వడ్లతో పాటు కొన్ని రకాల కందులు పండుతాయి. మహబూబ్ నగర్‌లో పచ్చ జొన్నలు, సజ్జలు, కందులు, దోసకాయ పంటలు వస్తాయి. రంగారెడ్డిలో భారతదేశానికే కందిపప్పు పండిస్తున్నారు. పాలకూర, కొతిమిర, మెంతి కూర, ద్రాక్ష తోటలు ఉండేవి. ఆర్టీసీలో పాలక్యాన్లు, కూరగాయలు, ఆకుకూరలతో వచ్చేవారు. పండ్ల తోటలు రియల్ ఎస్టేట్ లే అవుట్లు అయ్యాయి. పాలు, కోడిగుడ్లు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకుంటన్నాం. రైతులలో పంట మార్పిడి గురించి అవగాహనా పెంచాలని తుమ్మల నాగేశ్వరరావుకు సూచిస్తున్నాం. కేంద్రం 50 లక్షల మెట్రిక్ టన్నుల వరకే కొంటామని చెప్పింది. కానీ ఈ ఏడాది మనం ఇప్పటికే 75 లక్షల మెట్రిక్ టన్నుల వరకు రాష్ట్రం కొనుగోలు చేసింది. ఎగుమతి చేయాలన్నా గిట్టుబాటు ధర లేదు. కనుక రైతులు పంట మార్పిడి చేస్తేనే పరిస్థితిలో మార్పు వస్తుంది.

# కేబినెట్‌లోకి కొత్త నేతలు

మంత్రి పదవుల నుంచి తప్పించిన వారికి ప్రమోషన్లు ఇచ్చి పార్టీలో ఉన్నత పదవులు కట్టబెట్టాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఏ సామాజిక వర్గ మంత్రిని తొలగిస్తున్నారో కొత్తగా అవకాశం కల్పించే వారిని కూడా అదే సామాజిక వర్గం నుంచి తీసుకురావాలని తెలుస్తోంది. ఇక మంత్రివర్గం నుంచి తీసేసిన వారిని వారి సీనియారిటీని ఆధారంగా చేసుకుని సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికి సంబంధించి ఆయా మంత్రులకు ఇప్పటికే పార్టీ హైకమాండ్ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. అందుకు ఆ నేతలు కూడా సానుకూలంగానే అంగీకరించినట్లు హస్తం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత మంత్రులను తప్పించడంతోపాటు మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మరో 2 మంత్రి పదవులను కూడా భర్తీ చేసేందుకు ముహూర్తం ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే మంత్రి వర్గంలో మార్పులు, చేర్పులు చేసేందుకు ఆయా జిల్లాల ప్రాతినిథ్యం, సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావిస్తోంది. కేబినెట్ విస్తరణపై పార్టీలో అంతర్గత వివాదాలు రాకుండా ఉండేందుకు పక్కాగా ప్రణాళికలు చేస్తోంది. తప్పించిన మంత్రుల స్థానాలను అదే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలతోనే భర్తీ చేయాలనే నిర్ణయించినట్లు సమాచారం. ఇక మంత్రి పదవుల నుంచి తప్పించిన వారు అవమానంగా భావించకుండా ఉండేందుకు వారికి ఉన్నత పదవులు ఇచ్చి హైకమాండ్ భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. అలాంటి వారికి పార్టీలో కీలకమైన, గౌరవప్రదమైన సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక మంత్రివర్గ విస్తరణలో బీసీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. ఇందులో భాగంగానే బీసీల్లో సంఖ్యాబలం ఎక్కువ ఉన్న మున్నూరు కాపులు, ఎస్టీల్లో ఎక్కువ జనాభా ఉన్న లంబాడీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు కాంగ్రెస్ నేతల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈసారి శాసనమండలి నుంచి బీసీ సామాజికవర్గానికి చెందిన ఓ నేతకు కూడా మంత్రి పదవి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఆ నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చే సమయంలోనే మంత్రి పదవి ఇస్తామని స్వయంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు సమాచారం. కేబినెట్‌లో మార్పుల సందర్భంగానే చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులను కూడా భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. ఇందులో భాగంగానే అసెంబ్లీ, మండలి విప్‌ల నియామకాలు ఇటీవలె చేపట్టినా చీఫ్ విప్ నియామకాలను మాత్రం వాయిదా వేసినట్లు చర్చ జరుగుతోంది. మంత్రి పదవి రాని సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ హోదా ఉండే చీఫ్ విప్ పదవి ఇవ్వాలని భావిస్తున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇస్తున్నట్టు గతేడాది జూన్‌లో ప్రకటించగా తనకు ఆ పదవి ఇష్టం లేదని మంత్రి పదవి కావాలని ఆయన కాంగ్రెస్ పెద్దలకు తేల్చి చెప్పేశారు. దీంతో ఇంతవరకు కూడా డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదు. చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులకు కేబినెట్ హోదా ఉండటంతో మంత్రివర్గ విస్తరణ సందర్భంగా వీటిని కూడా భర్తీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

## ఇక్రిశాట్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అవగాహన రాహిత్యం

సంస్థ అని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ సంస్థ ఏర్పాటులో ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ), ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్డీపీ)తో పాటు ప్రపంచ బ్యాంకు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. ప్రారంభ దశలో ఫోర్డ్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ల సహకారంతో పాటు, భారత ప్రభుత్వం సహా అనేక దేశాల మద్దతుతో నడుస్తున్న ఒక గ్లోబల్ వేదికను 'అమెరికా రీసెర్చ్ సెంటర్' అని ఎలా అంటారని ఆయన ప్రశ్నించారు. కేవలం ఇక్రిశాట్ విషయంలోనే కాకుండా, నల్లమల సరిహద్దులు, కృష్ణా-గోదావరి జలాలు, సుంకేసుల ప్రాజెక్టుల వంటి కీలక అంశాలపై కూడా సీఎంకు సరైన అవగాహన లేదని హరీశ్ రావు ఆరోపించారు. ఇంతటి ప్రాథమిక విషయాలు కూడా తెలియని స్థితిలో రాష్ట్రాన్ని నడపడం వల్ల తెలంగాణ ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి చేసే ప్రతి వ్యాఖ్య బాధ్యతాయుతంగా, వాస్తవాల ఆధారంగా ఉండాలని సూచించారు. ఇప్పటికైనా నోటికి ఏది వస్తే అది మాట్లాడటం మానుకుని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడటం అలవాటు చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు ఘాటుగా హితవు పలికారు.

## సిద్దిపేట జిల్లాలో ఆయిల్ పాం ఫ్యాక్టరీ ప్రారంభం

నగర్‌లలో కొత్త పిహెచ్‌సి భవనాలను జాతికి అంకితం చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో కూడా భారీ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ముఖ్యంగా కొండపాకలో రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునాది రాయి వేశారు. మర్కూక్ మరియు జగదేవ్‌పూర్ మండలాల్లో నూతనంగా నిర్మించిన సమీకృత మండల కార్యాలయాల సముదాయాలను (ఐఓసీ) ప్రారంభించడంతో పాటు, మర్కూక్ తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో అదనపు మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించారు.

### అన్నగా బాధ్యత తీసుకున్నాను.. సీఎం రేవంత్ రెడ్డి

అన్నదాత సంతోషం కోసం అన్నగా బాధ్యత తీసుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రైతును ధైర్యంగా సాగు మడిలో నిలబెట్టేందుకు భరోసా ఇస్తున్నా అన్నారు. 70 లక్షల మంది రైతన్నలకు పంట పెట్టుబడి సాయంగా రూ.9000 కోట్ల రైతు భరోసా నిధుల విడుదల నేడు ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నర్మెట గ్రామ వేదికగా మరోసారి మా పాలనలో రైతే రాజు అని రుజువు చేస్తూ పథకాన్ని అమలు చేస్తున్నామని రేవంత్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఆర్థిక సాయంతో చేతులు దులుపుకోవడం మాత్రం కాదు, కేవలం 17 నెలల వ్యవధిలో పామ్ ఆయిల్ పరిశ్రమ మొదలు పెట్టి, పూర్తి చేసి నేడు రైతులకు అంకితం చేస్తున్నామని పోస్ట్ చేశారు. దానికి కొనసాగింపుగా రిఫైనరీ యూనిట్ కు నర్మెట్టలో శంకుస్థాపన చేస్తున్నాం అని ఆదివారం ఆయన చేసిన పోస్ట్ వైరల్ అయింది.

## రోడ్డు పనులు ప్రారంభించాలంటూ యువకుల ధర్నా

రాయపోల్: సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం గుర్రాల సోఫా వద్ద బేగంపేట, అప్పాయిపల్లి, వడ్డేపల్లి, దొడ్లపల్లి, మాచినపల్లి గ్రామాల యువకులు రహదారిపై ధర్నాకు దిగారు. హైమద్ నగర్ చౌరస్తా నుంచి నాచారం వరకు ఆర్అండ్‌బీ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. రోడ్ల దుస్థితి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేదంటే అన్ని గ్రామాల యువకులతో కలిసి రహదారి దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. యువకుల ధర్నా గురించి తెలియగానే.. సీఐ వారితో ఫోన్‌లో మాట్లాడి నచ్చజెప్పారు. మంగళవారం నాడు కలెక్టర్‌ను కలిసి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో యువకులు ధర్నాను విరమించారు. అయితే హామీ అమలు కాకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## ఖరీదైన కారుతో రోడ్డుపై స్టంట్లు..



బెంగళూరు: ఖరీదైన లంబోర్గిని కారుతో రోడ్డుపై స్టంట్లు చేశారు. వేగంగా ప్రయాణించిన ఆ కారు క్రాస్ రోడ్డులో ప్రమాదకరంగా రౌండ్లు కొట్టింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. శనివారం తెల్లవారుజామున 2-3 గంటల సమయంలో బెంగళూరు ఎంజీ రోడ్డులోని అనిల్ కుంబ్లే సర్కిల్ వద్ద లగ్జరీ కారైన లంబోర్గినితో విన్యాసాలు చేశారు. ఆ సర్కిల్‌లో హై-స్పీడ్ డ్రిఫ్టింగ్ స్టంట్ చేశారు. దీంతో ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగింది. కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఇది పోలీసుల దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో కారుతో ప్రమాదకర విన్యాసాలపై కేసు నమోదు చేశారు. లంబోర్గిని యజమాని, ఆ సమయంలో డ్రైవ్ చేసిన వ్యక్తిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## యుద్ధం వేళా

# మోదీ కీలక భేటీ

అంతరాయం ఏర్పడటంతో భారత్ సహా ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ కొరత ఏర్పడుతోంది. దీంతో ఆయా దేశాల్లో దారుణమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. మన దేశంలోనూ గ్యాస్ కొరత తలెత్తగా ఇటీవల పలు నౌకలు పోర్టులకు చేరడంతో కాస్త ఉపశమనం కలిగింది. అయితే యుద్ధం ఇప్పట్లో ఆగే పరిస్థితులు కనిపించకపోవడంతో రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత దారుణంగా తయారయ్యే అవకాశాలు ఉన్నాయనే భయాలు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అలర్ట్ అయింది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో పలువురు సీనియర్ మంత్రులతో కీలక సమావేశం సాయంత్రం నిర్వహించారు. దేశంలో గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తులు, ముడి చమురు, ఎరువుల లభ్యత, విద్యుత్ రంగాలు ప్రస్తుతం ఎలా ఉన్నాయి అనే దానికి సంబంధించి సమీక్ష చేపట్టారు. దేశంలో నిరంతరాయంగా ఇంధనాన్ని సరఫరా చేయడం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరకు రవాణా చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇక ఈ ఉన్నత స్థాయి కేబినెట్ భేటీకి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, జేపీ నడ్డా, అశ్వినీ వైష్ణవ్, హర్దీప్ సింగ్ పురీ, రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. వీరితోపాటు జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ ధోవల్ సహా వివిధ శాఖలకు సంబంధించిన కీలక ఉన్నతాధికారులు పాల్గొన్నారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియలో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ పరిస్థితులను సమీక్షించడంతోపాటు పెట్రోలియం ఉత్పత్తులు సహా దేశంలో నిత్యావసరాల సరఫరాకు అంతరాయం లేకండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని అధికార వర్గాలు తెలిపాయి.

# హార్మూజ్ తెరిచే ఉంది

ఇజ్రాయెల్లే కారణమని ఆయన ఆరోపించారు. తాము దౌత్యానికే ప్రాధాన్యత ఇస్తామని, అయితే దురాక్రమణలను అడ్డుకోవడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. నావికుల భద్రత కోసం ఐఎంవోతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మరోవైపు, 48 గంటల్లోగా హార్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని, లేనిపక్షంలో ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. ప్రపంచంలోని మొత్తం చమురు రవాణాలో దాదాపు ఐదో వంతు ఈ జలసంధి నుంచే జరుగుతుంది. దీంతో ఇక్కడ ఎలాంటి అంతరాయం ఏర్పడినా అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

# ప్రధాని మోదీ అరుదైన ఘనత

కొనసాగుతున్నారు. రెండు దశాబ్దాలకు పైగా సాగిన ఈ ఉమ్మడి పదవీకాలం, వివిధ స్థాయిల పాలనలో ఆయన రాజకీయ ఆధిపత్యాన్ని, ఎన్నికల విజయాన్ని స్పష్టం చేస్తోంది.

### రెండో స్థానంలో పవన్ కుమార్ చామ్లింగ్

సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ ఇప్పుడు 8930 రోజుల పదవీకాలంతో రెండో స్థానంలో ఉన్నారు. చామ్లింగ్ సిక్కిం రాష్ట్రానికి వరుసగా 24 ఏళ్ల 165 రోజుల పాటు సేవలందించారు. దీంతో ఆయన భారత్‌లో సుదీర్ఘకాలం సేవలందించిన ముఖ్యమంత్రులలో ఒకరిగా నిలిచారు.

### నవీన్ పట్నాయక్ మూడో స్థానం

మూడవ స్థానంలో ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఉన్నారు. ఆయన 2000 నుండి 2024 వరకు రాష్ట్రాన్ని పాలించారు. ఆయన దాదాపు 24 ఏళ్ల 99 రోజుల పదవీకాలాన్ని పూర్తి చేశారు. నవీన్ పట్నాయక్ సుదీర్ఘ పాలనకు రాజకీయ స్థిరత్వం, నిరంతర ఎన్నికల విజయాలే గుర్తింపుగా నిలిచాయి. ఇది ఆయనను భారత్‌లో అత్యంత సుదీర్ఘకాలం కొనసాగిన నాయకులలో ఒకరిగా నిలబెట్టింది.

### ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పదవీకాలం

ఈ ర్యాంకింగ్‌ను ప్రత్యేకంగా ఆసక్తికరంగా మార్చే అంశం ఏమిటంటే.. ఇందులో ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా గడిపిన సమయాన్ని కలిపి లెక్కించారు. కేవలం ప్రధానమంత్రిగా మాత్రమే సేవలందించిన జవహర్‌లాల్ నెహ్రూ వారి పదవీకాలం సుదీర్ఘంగా ఉన్నప్పటికీ, ఈ ప్రత్యేక గణన కింద మొదటి మూడు స్థానాల్లో చోటు దక్కించుకోలేకపోయారు. 1947 ఆగస్టు 15న స్వతంత్ర భారత తొలి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన నెహ్రూ 27 మే 1964న ఢిల్లీలో కన్నుమూశారు. అప్పటివరకూ దాదాపు 17 ఏళ్లపాటు ప్రధానిగా సేవలు అందించారు. నెహ్రూ టాప్ 5లో జాబితాలో లేకపోవడం గమనార్హం.

### ఈ జాబితాలోని ఇతర ప్రముఖ నాయకులు

సీనియర్ నాయకుడు జ్యోతి బసు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఏకంగా 23 ఏళ్లకు పైగా పనిచేశారు. ఆయన ఈ టాప్-3 జాబితాలో లేనప్పటికీ, భారత రాజకీయ చరిత్రలో ఒకే పదవిలో అత్యంత సుదీర్ఘకాలం నాయకత్వం వహించిన వారిలో ఒకరిగా చరిత్రలో నిలిచిపోయారు.

## అమరావతిలో నివసించే వారు

# 20 ఏళ్లు ఎక్కువ జీవిస్తారు

అత్యుత్తమ వాతావరణం కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మిగతా ప్రాంతాలతో పోల్చితే ఏపీ రాజధానిలో జీవన ప్రమాణాలు అత్యున్నత స్థాయిలో ఉండేలా చూస్తామని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర అభివృద్ధికి తాను చేసిన కృషిని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. "1990లలో ఇంటర్నెట్ కొత్తగా వచ్చినప్పుడు ఐటీ కంపెనీలను తీసుకురావడానికి ఎంతో శ్రమించాను. ఢిల్లీ వెళ్లి బిల్ గేట్స్‌ను కలిసి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రం పెట్టాలని కోరాను. నాటి ప్రధాని వాజ్‌పేయితో చర్చించి టెలికాం సంస్కరణలు తీసుకువచ్చాం. శంషాబాద్ ఎయిర్‌పోర్టు కోసం 5 వేల ఎకరాలు సేకరించాం.

ట్రిపుల్ ఐటీ, నల్సార్, జీనోమ్ వ్యాలీ వంటివి నా కృషితోనే సాధ్యమయ్యాయి" అని వివరించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ.. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని, భవిష్యత్తులో ప్రపంచ డేటా సెంటర్లన్నీ భారత్‌కే వస్తాయని జోస్యం చెప్పారు. ప్రస్తుతం హార్టికల్చర్, ఆక్వాకల్చర్‌లో ఏపీ అగ్రస్థానంలో ఉందని, గ్రీన్, సోలార్ ఎనర్జీని కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

గతంలో తాము ప్రవేశపెట్టిన పీపీపీ విధానంలోనే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టులు, ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని గుర్తుచేశారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేసిన చంద్రబాబు, ఇకపై రాష్ట్రాన్ని వేగంగా ప్రగతి పథంలో నడిపిస్తామని భరోసా ఇచ్చారు.

# అవమానాలు ఇక చాలు

వెల్లడించారు. గత 20 నెలలుగా మానసిక క్షోభకు గురవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాబట్టి అవమానాలు ఎదుర్కొంటూ పార్టీలో కొనసాగలేనని జీవన్ రెడ్డి కార్యకర్తలకు తేల్చిచెప్పేశారు. అలాగే భవిష్యత్ రాజకీయంపైనా క్లారిటీ ఇచ్చారు. రాజీనామా తర్వాత జగిత్యాలలో స్థానిక నేతలు, కార్యకర్తలతో భేటీ అవుతానని జీవన్ రెడ్డి తెలిపారు. ఇందులో అందరి సలహాలు, సూచనలతో తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. అలాగే తన రాజకీయ ప్రస్థానంలో మీ తోతడు, మార్గదర్శనం కావాలంటూ కార్యకర్తల్ని జీవన్ రెడ్డి కోరారు. మరోవైపు కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పకముందే ఆయన్ను తమ పార్టీలోకి తెచ్చేందుకు బీజేపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. దీంతో బీజేపీ నేతలతో ఆయన చర్చలు కూడా జరిపినట్లు తెలుస్తోంది. దీనిపై మరో రెండు, మూడు రోజుల్లో పూర్తి క్లారిటీ రానుంది.

## సీఎం పర్యటన సందర్భంగా అక్రమ అరెస్టులను
# ఖండిస్తున్నాం: సోమగారి నాగిరెడ్డి



తొగుట : సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా తొగుట పోలీసులు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమగారి నాగిరెడ్డి ని ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ అరెస్టులపై రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి, కో-కన్వీనర్ భరత్ సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. పోలీసుల చర్య ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.నాగిరెడ్డి అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేయడమేనన్నారు. 2024 మార్చి నుంచి రిటైర్ట్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల కోసం రెండు సంవత్సరాలుగా నిరసనలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ మాత్రమే ఇస్తూ, ఇతర బకాయిలను చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఈ సమస్యపై పలుమార్లు పోరాటాలు జరిగినా ఫలితం లేకపోవడం బాధాకరమని తెలిపారు.అక్రమ అరెస్టులకు పాల్పడుతున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని నాగిరెడ్డి హెచ్చరించారు. సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు రేవా జిల్లా అధ్యక్షుడు పోనమల రాములు సహా పలువురు నాయకులను స్టేషన్‌లో నిర్బంధించారని ఆరోపించారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెన్షనర్ల బకాయిల చెల్లింపుకు నిధులు కేటాయించకపోవడం దారుణమని విమర్శించారు. పెన్షన్ బకాయిలు అందక ఇప్పటికే 83 మంది మరణించారని పేర్కొన్నారు. పెన్షనర్ల పట్ల ప్రభుత్వానికి కనీస కనికరం కూడా లేకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు.

# శాస్త్ర విరుద్ధంగా ప్రవర్తించిన
# ప్రధాన అర్చకుడు పై చర్యలు తీసుకోవాలి



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) జాతా శౌచం ఉన్నప్పటికీ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలలో పాల్గొని శాస్త్ర విరుద్ధంగా ప్రవర్తించి హిందూ ధర్మానికి విఘాతం కలిగించే వ్యవహరించిన యాదగిరిగుట్ట దేవస్థానం ప్రధాన అర్చకుడు కాందూరి వెంకటాచార్యులు ముఖ్య అర్చకులు కాందూరి శ్రీనివాసచార్యులపై తగిన చర్యలు తీసుకోవాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పలు హిందూ సంఘాల నేతలతో కలిసి యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో జె భవాని శంకర్ కు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాదగిరిగుట్ట దేవస్థానంలో ప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్న కాందూరు వెంకటాచార్యులు శాస్త్రానికి ఆలయ సంప్రదాయాలకు విరుద్ధంగా ప్రవర్తించారని ఆరోపించారు. కాండూరు వెంకటాచార్యులు సొంత పాలి బంధువైన కాండూరి భార్గవ్ కు శిశువు జన్మించగా హిందూ శాస్త్ర ప్రకారం శిశువు జన్మించిన రోజు నుండి ఆ కుటుంబానికి చెందిన వారికి జత శౌచం పది రోజులపాటు ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో ఆయన ఆలయానికి వెళ్లడం పూజలు చేయడం ఇతర ధార్మిక కార్యక్రమాలలో పాల్గొనడం చేయకూడదని తెలిపారు. సొంత పాలుబంధు అయినప్పటికీ తాండూర్ వెంకటాచార్యులతో పాటు ముఖ్య అర్చకులు శ్రీనివాసచార్యులు కూడా ఆలయ సంప్రదాయాలకు విరుద్ధంగా ప్రవర్తించారని అన్నారు. యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలలో వారు పాల్గొని సాంప్రదాయానికి విఘాతం కలిగించారని ఆరోపించారు. ఈ విషయం ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడేందుకు ప్రయత్నించారని అన్నారు. ఫిబ్రవరి 25వ తేదీన జరిగిన స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని కాండూరు వెంకటాచార్యులు జాత శౌచం ఉన్నప్పటికీ నిర్వహించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేవుడికి సమర్పించే పట్టు వస్త్రాలను ఆయన మైలలోనే స్వయంగా పట్టుకున్నారని విమర్శించారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రులకు అధికారులకు మైలలో ఆశీర్వచనం చేశారని ఆరోపించారు. ఆ తర్వాత జరిగిన రథోత్సవం సందర్భంగా కూడా ఆయన రథంపై ఎక్కి పూజలు నిర్వహించారని పూర్ణాహుతి చక్రస్నానం కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొన్నారని తెలిపారు. ఇవన్నీ స్వయంగా జరిగాయని టీవీలలో అన్ని పత్రికలలో ఇవి వచ్చాయని ఈ విధంగా శాస్త్ర విరుద్ధంగా ప్రవర్తించిన కాండూర్ వెంకటాచార్యులు ముఖ్య అర్చకులు కాండూరి శ్రీనివాసచార్యులపై తగిన చర్యలు తీసుకోవాలని తమ డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇది హిందూ ధర్మాన్ని శాస్త్రాన్ని అవమానపరచడమేనని ఆయన ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై తగిన విధంగా విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు వీరిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు ఐఏఎస్ లేదా రిటైర్డ్ న్యాయమూర్తితో కమిటీ వేసి ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు తాము యాదగుట్ట దేవస్థానం ఈవోకు ఒక వినతి పత్రాన్ని అందజేశామని దీనిపై పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటామని ఈవో హామీ ఇచ్చారని నల్ల రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట దళిత సంఘర్షణ సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్ద యుగంధర్ తెలంగాణ సీనియర్ సిటిజన్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ హనుమాండ్ల విష్ణు, టేకి రాజశేఖర్ విహెచ్పి నేత కొమ్మ గళ్ళ వెంకటేశ్వర్లు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల పరిరక్షణ సమితి కన్వీనర్ కనుకుంట్ల విజయకుమార్, బిజెపి నేత బొల్లం చంద్రమౌళి , మన్నెం నరసింహారెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## కుక్కల దాడిలో 15 జింకలు మృతి..
## నలుగురు అటవీ శాఖ సిబ్బంది సస్పెండ్



రాయ్‌పూర్: వీధి కుక్కల దాడిలో 15 జింకలు మరణించాయి. దీంతో అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుర్గుజా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అంబికాపూర్‌లోని సంజయ్ వన్ వాటికను అటవీ శాఖ నిర్వహిస్తున్నది. చిన్న జూ మాదిరిగా ఉండే ఈ వనంలో పలు రకాల జింకలు ఉన్నాయి. వీటిని చూసేందుకు సందర్శకులు వస్తుంటారు.కాగా, శనివారం తెల్లవారుజామున జింకల ఎన్‌క్లోజర్‌లోకి ఐదారు వీధి కుక్కలు చొరబడ్డాయి. అక్కడి జింకలపై దాడి చేశాయి. దీంతో మచ్చల జింక, మొరిగే జింక, నాలుగు కొమ్ముల దుప్పిలతో సహా పద్నాలుగు జింకలు శనివారం మరణించాయి. కుక్కలు కరవడంతో తీవ్రంగా గాయపడిన ఒక జింక ఆదివారం చనిపోయింది.మరోవైపు కుక్కల దాడి వల్ల 15 జింకలు చనిపోయినట్లు సుర్గుజా డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో) అభిషేక్ జోగావత్ తెలిపారు. నిబంధనల ప్రకారం వాటికి అంత్యక్రియలు నిర్వహించినట్లు చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఒక డిప్యూటీ రేంజర్, ముగ్గురు ఫారెస్ట్ గార్డులతో సహా నలుగురిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.అంబికాపూర్ సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ నేతృత్వంలో ఒక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు అభిషేక్ జోగావత్ తెలిపారు. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

## టీటీడీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.కోటి విరాళం



తిరుమల : చెన్నైకు చెందిన సుబ్బారావ్ అపారల్స్ సంస్థ టీటీడీ శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి ఆదివారం రూ.కోటి విరాళం గా అందించింది. ఈ మేరకు దాత జే.రాజా రమేష్ తిరుపతిలోని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మార్చి 30 నుంచి తిరుమల శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు

తిరుమల శ్రీవారి ఆలయంలో మార్చి 30 నుండి ఏప్రిల్ 01 తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. వసంతోత్సవాన్ని పురస్కరించుకొని మూడురోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను, మార్చి 31న అష్టదళ పాద పద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

## వివో టీ5ఎక్స్ 5జీ ఫోన్ విడుదల..
## ధర బడ్జెట్‌లోనే.. కీలక ఫీచర్లివి




చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ బ్రాండ్ వివో తాజాగా ఇండియాలో టీ5ఎక్స్ పేరుతో 5జీ ఫోన్‌ను విడుదల చేసింది. ఈ నెల 24 నుంచి ఫ్లిప్‌కార్ట్, వివో ఆన్‌లైన్ స్టోర్, ఎంపిక చేసిన ఔట్‌లెట్లలో ఫోన్ అందుబాటులో ఉంటుంది. 7,200 ఏంఏహెచ్ కెపాసిటీ కలిగిన పవర్‌ఫుల్ బ్యాటరీతోపాటు మీడియాటెక్ డిమెన్సిటీ 7,400 టర్బో చిప్‌సెట్ దీని ప్రత్యేకత. ఈ ఫోన్‌లోని ప్రధాన ఫీచర్లివి. 6.76 అంగుళాల ఎల్‌సీడీ ప్యానెల్, 120 హెర్జ్ రిఫ్రెష్ రేట్, 1,200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, మీడియాటెక్ డిమెన్సిటీ 7,400 టర్బో చిప్‌సెట్, యూఎఫ్ఎస్ 3.1 స్టోరేజ్, 6జీబీం128జీబీ, 8జీబీం128జీబీ, 8జీబీం256జీబీ, నానో డ్యుయల్ సిమ్, ఐపీ 68, ఐపీ 69 రేటింగ్, సైడ్ మౌంటెడ్ ఫింగర్‌ప్రింట్ సెన్సర్, ఆండ్రాయిడ్ 16 ఓఎస్ బేస్డ్ ఒరిజిన్ ఓఎస్ 6.0, రెండేళ్లపాటు ఓఎస్ అప్‌డేట్స్, నాలుగేళ్లపాటు సెక్యూరిటీ అప్‌డేట్స్, 50 ఎంపీ సోనీ ప్రైమరీ కెమెరా, 2 ఎంపీ బొకే కెమెరా, 32 ఎంపీ సెల్ఫీ కెమెరా, 219 గ్రాముల బరువు, 7,200 ఏంఏహెచ్ బ్యాటరీ, 44 వాట్స్ ఫాస్ట్ వైర్డ్ ఛార్జింగ్ వంటివి ప్రధాన ఫీచర్లు. ధరలు వేరియెంట్‌ను బట్టి రూ.18,999 / రూ.20,999 / రూ.22,999.

## బీసీ సబ్ ప్లాన్ అమలుచేసి
# 50 వేల కోట్ల కేటాయించాలి

- బడ్జెట్ లో బీసీ లకు చాలా అన్యాయం జరిగింది
- బీసీ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పందించాలి
- బీ ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్ర వెంకటయ్య డిమాండ్



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సబ్ ప్లాన్ అమలు చేసి 50 వేల కోట్లు కేటాయించాలని ,కామారెడ్డి డిక్లరేషన్ పేరిట అధికారంలోకి వచ్చి బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్ర వెంకటయ్య మండిపడ్డారు. ప్రతి ఏటా బీసీల బడ్జెట్ కు 25వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి ఒక రూపాయి కేటాయించకపోవడం దుర్మార్గమని అన్నారు. ఆదివారం పట్టణంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు కామారెడ్డి డిక్లరేషన్ బూచిగా చూపి ఇలా బీసీలను పూర్తిగా మర్చిపోయారన్నారు. బీసీల ఓట్లను ఒక బ్యాంకు గా చూడడమే తప్ప వారి అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ఏమాత్రం పాటుపడటం లేదన్నారు. బీసీల కార్డుతో ఎమ్మెల్యేగా గెలిచిన బీర్ల ఐలయ్య ఎందుకు అసెంబ్లీలో మాట్లాడడం లేదు. బీసీ అని చెప్పుకునే ఎమ్మెల్యే అయిలయ్య ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని బీసీల వద్దకు వెళ్తారో చెప్పాలన్నారు. ఈ బడ్జెట్ లో సామాజిక న్యాయం జరుగలేదని అన్నారు. గౌడ్స్ , గొల్ల కురుమలు, పద్మశాలి, రజక, కుమ్మరి, కమ్మరి కులస్తులతో పాటు బీసీ ల్లో ఏ కులస్తులకు న్యాయం జరుగలేదని ఆవేదన చెందారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారులకు రాగానే 100 రోజుల్లో బీసీ సంక్షేమానికి యేటా 25వేల కోట్ల బడ్జెట్ను కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు ఇచ్చిన ఆమెని మర్చిపోయి బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డిక్లరేషన్ ఊసెత్తడం లేదన్నారు . ప్రతి ఏటా బిసి సంక్షేమానికి 25000 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల కాలంలో కేవలం ఐదు కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. బీసీ కార్డుతో ఎమ్మెల్యే అయిన అసెంబ్లీలో బీసీల అభివృద్ధి గురించి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో తిరుగుతూ నేను బీసీ బిడ్డను అని చెప్పుకోను అయిలయ్య ఆ బీసీల అభివృద్ధిపై ఎందుకు స్పందించడం లేదో చెప్పాలన్నారు. రెడ్డి అగ్ర కులస్తుల వద్ద బీసీ కులాన్ని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అమ్మకాని పెట్టారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీసీల నుంచి కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మిట్ట వెంకటయ్య, మండల సెక్రెటరీ జనరల్ కసావు శ్రీనివాస్ గౌడ్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు సతీష్ యాదవ్, నాయకులు బాలయ్య గౌడ్, కంసాని స్వామి, శారాజీ రాజేష్ యాదవ్, విజయ్, లింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంపై అనుచిత వ్యాఖ్యలు
# గరికపాటిపై చర్యలు తీసుకోవాలి

- ఏఐఎస్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షులు :అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పాఠశాలల్లో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గరికపాటి నరసింహ రావు పై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం వల్ల అనేక మంది పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యను కొనసాగించగలుగుతున్నారని ఆయన పేర్కొన్నారు. అలాంటి కీలకమైన పథకాన్ని, దాని ద్వారా లబ్ధి పొందుతున్న విద్యార్థులను తక్కువ చేసి మాట్లాడటం బాధాకరమని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో వెనుకబడిన వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా ఉంటాయని, విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపించి, సంబంధిత వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తూ, విద్యార్థుల గౌరవాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.

## ఆయిల్ ఫామ్ కర్మాగారం ప్రారంభ సభకు
# భారీగా తరలి వెళ్లిన రైతులు

- విలాసాగర్ గ్రామ సర్పంచ్ కనుకయ్య ఆధ్వర్యంలో
తరలివెళ్లిన విలాసాగర్, కొదురుపాక గ్రామాల రైతులు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా, నేర్మేట గ్రామంలో నిర్వహించిన ఆయిల్ ఫామ్ కర్మాగారం ప్రారంభ మహోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొని సభను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సభకు రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య అధ్యక్షతన, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు విలాసాగర్, కొదురుపాక గ్రామాల రైతులు సమూహంగా తరలి వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో విలాసాగర్ ఏఈఓ రజిత, కొదురుపాక ఏఈఓ రవళి, విలాసాగర్, కొదురుపాక గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు తెలుపుతూ, ఆయిల్ ఫామ్ కర్మాగారం ప్రారంభంతో తమకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వ్యక్తి వికాసమే దేశాభివృద్ధికి పునాది

- గ్రామ స్థాయిలో సేవా దృక్పదం పెంపొందించాలి
- భారతీయ జనతా పార్టీ జిల్లాధ్యక్షులు : గంగాడి కృష్ణారెడ్డి
- బోయినిపల్లిలో బీజేపీ శిక్షణ మహాభియాన్ విజయవంతం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు పరశురామ్ ఎడపల్లి ఆధ్వర్యంలో "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్--2026" కార్యక్రమం (మార్చి 21--22) రెండు రోజులపాటు ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, కళ్లెం వాసుదేవ రెడ్డి, మండల ప్రభారీ వైద రామానుజం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యకర్తలలో సిద్ధాంత స్పష్టత, సేవాభావం పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. బత్తుల లక్ష్మీనారాయణ, కరెండ్ల మధుకర్, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, సంగం నరేష్ పార్టీ సిద్ధాంతాలు, అంత్యోదయ లక్ష్యం, "సంపూర్ణ మానవత్వం"పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉదారి నరసింహ చారి, గుడి రవీందర్ రెడ్డి, బొంగాని అశోక్ గౌడ్, పెంచాల సౌమ్య - మహేశ్,జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, కొండం శ్రీనివాస్ రెడ్డి, స్వామి కుమార్, శరత్ చంద్రారెడ్డి, పాలోజు రాజేంద్రప్రసాద్, అమెరిశెట్టి గంగయ్య, మెరుపుల గంగాధర్, మెరుపుల సంగీత, భోగోజి గంగాధర్ చారి, కొనుకటి హరీష్, సారంపల్లి రాజు, ఇల్లందుల బాలయ్య, జనగాం లక్ష్మణ్, సుంకపాక ప్రభు, రజనీకాంత్, రాచర్ల రాజేశం, చిలూముల రమేశ్, నిఖిల్, కల్యాణం అనిల్, శ్రీనివాస్, ప్రశాంత్, నాయిని నాగరాజు, నరేశ్, రంజిత్, ప్రసాద్, బుర్ర ప్రదీప్, ధర్మేంద్ర, అజయ్, సింగరి వెంకటేష్, చంద్రయ్య, కట్ట విజయ్, బ్రహ్మ ప్రసాద్, రామానుజం తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తలు ప్రజలతో మమేకమై సేవ చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# వరద కాలువలో భారీ చేప పట్టిన యువకుడు - గ్రామంలో సందడి



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలం, నూకలమర్రి గ్రామంలో ఆదివారం ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని వరద ఉప కాలువలో అలుగు జాతికి చెందిన భారీ చేప ఒకటి దొరికింది. ఈ చేపను అదే గ్రామానికి చెందిన యువకుడు ఆవునూరి శ్రీకాంత్ పట్టుకొని గ్రామస్థులను ఆశ్చర్యానికి గురిచేశాడు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, "సాధారణంగా చేపలు పడతాం కానీ ఇంత పెద్ద చేప దొరకడం ఇదే మొదటిసారి. కాలువలో కదలిక కనిపించడంతో ప్రయత్నించాను, అదృష్టవశాత్తూ ఈ భారీ చేప పట్టగలిగాను. దీని బరువు 15 కిలోలకు పైగానే ఉంటుంది" అని ఆనందం వ్యక్తం చేశాడు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ, "మన గ్రామ కాలువలో ఇంత పెద్ద చేప కనిపించడం అరుదైన విషయం. శ్రీకాంత్ అదృష్టం బాగుంది. ఇది గ్రామానికి ప్రత్యేక ఆకర్షణగా మారింది" అని అన్నారు. ఈ భారీ చేపను చూసేందుకు గ్రామస్థులు పెద్ద ఎత్తున చేరుకొని సందడి చేశారు. ప్రస్తుతం ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

# నూతన వస్త్రాలంకరణ వేడుకకు అనుముల భాస్కర్ - దివ్య దంపతుల హాజరు - ఆశీస్సులు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త గోనె సంపత్ - రాధ దంపతుల కుమార్తె శ్రీచందన నూతన వస్త్రాలంకరణ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నీలోజిపల్లి గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు అనుముల భాస్కర్ - దివ్య దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, "ఇలాంటి సంప్రదాయ వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టే మహత్తర సందర్భాలు. చిన్నారి శ్రీచందన మంచి ఆరోగ్యం, విద్యలో ప్రగతి సాధిస్తూ, కుటుంబానికి గౌరవం తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. గోనె సంపత్ – రాధ దంపతులకు ఈ సంతోషకరమైన వేడుక సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మానవత్వాన్ని చాటుకున్న ఎడపల్లి బాబు

- మృతురాలి కుటుంబానికి పరామర్శ - ఆర్థికసాయం అందజేత



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన బోయిని లింగయ్య కుమార్తె మృతి చెందడంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ విషాద ఘటనపై అదే గ్రామానికి చెందిన ఎడపల్లి బాబు అనే యువకుడు సామాజిక స్పృహతో స్పందించాడు. ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, నగదు రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ కార్యక్రమంలో హరీష్ యాదవ్,బోయిని మల్లేశం, ముత్యంపాట శ్రీనివాస్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ పై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం



కాప్రా(ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ బిసి, ఎస్సి, ఎస్టీ, నాయకులు, కార్యకర్తలు తీవ్ర స్థాయి లో విమర్శలు చేస్తున్నారు. ఈ బడ్జెట్ బహుజన వ్యతిరేకమని, ముఖ్యంగా బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని, నిరుద్యోగ యువత ఆశలు పూర్తిగా ఆవిరయ్యాయని ఆరోపిస్తున్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి క్యాంప్ ఆఫీస్ ఏ.ఎస్. రావు నగర్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఎండగట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు నేర్థం భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 56 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాకు కేవలం 3.8 శాతం నిధులు మాత్రమే కేటాయించడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని మండిపడ్డారు. రూ. 3.25 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి తక్కువ నిధులు కేటాయించడం ప్రభుత్వ వైఖరిని స్పష్టంగా చూపుతోందని విమర్శించారు. అలాగే నిరుద్యోగ యువత ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్ ప్రస్తావన కూడా బడ్జెట్‌లో లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. ఉద్యోగాల భర్తీపై ఎలాంటి స్పష్టత లేకపోవడం వల్ల యువత భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల విషయంలోనూ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, బడ్జెట్ కేటాయింపులకు ఎలాంటి పొంతన లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే బడ్జెట్ కేటాయింపులను సవరించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఎమ్మెల్యే సమక్షంలో జరగవలసిన సమావేశంలో ఎమ్మెల్యే లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉద్యమకారుడు కరిపే ప్రవీణ్ ( వంజరి) మాట్లాడుతూ తెలంగాణలో బీసీలకు కేసీఆర్ హయాంలోనే మంచి జరిగిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ బీసీ నాయకులు కనకరాజు గౌడ్ మాజీ కార్పొరేటర్ లు గొల్లూరి అంజయ్య జేరిపోతుల ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ తెలుగు జర్నలిస్టులకు 'ఉగాది పురస్కారాలు-2026'కు ఆహ్వానం

- 40 విభాగాలకు జర్నలిస్టుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- తెలుగు జర్నలిస్టుల సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో సత్కారం
- ఏప్రిల్ 5 లోగా దరఖాస్తులు పంపాలన్న ప్రెసిడెంట్ రంగనాయకులు





అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తూ అక్షరాయుధాలతో సమాజాన్ని చైతన్యపరుస్తున్న జర్నలిస్టులను గౌరవించడం సమాజపు బాధ్యత అని తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఉగాది పురస్కారాలు--2026' కార్యక్రమంలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల జర్నలిస్టుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ వృత్తిపరంగా జర్నలిస్టులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2023లో ఈ పురస్కారాల ప్రక్రియను ప్రారంభించామని చెప్పారు. గత మూడు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ నగరాల్లో విజయవంతంగా ఈ కార్యక్రమాలను నిర్వహించామని, ఈ ఏడాది కూడా మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. త్వరలోనే వేదికను ఖరారు చేస్తామన్నారు.

## 50 మందికి 40 విభాగాల్లో పురస్కారాలు..

మొత్తం 40 విభాగాల్లో 50 మంది ప్రతిభావంతులైన జర్నలిస్టులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. మహిళా జర్నలిస్టుల ప్రోత్సాహం కోసం ప్రత్యేకంగా 5 పురస్కారాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి : మేడవరపు రంగనాయకులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పరిపాలన పరంగా వేరైనా, జర్నలిస్టుల ఐక్యత మాత్రం చెదరలేదని, "మేమంతా తెలుగు జర్నలిస్టులమే" అన్న భావనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు.

గతంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ వంటి ప్రముఖుల చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని, ప్రతిభ కలిగిన జర్నలిస్టులను గుర్తించి ఉత్తమ జర్నలిజాన్ని ప్రోత్సహించడం తమ ముఖ్య లక్ష్యమని రంగనాయకులు స్పష్టం చేశారు. వృత్తిపట్ల నిబద్ధత, అంకితభావం కలిగిన జర్నలిస్టులకు ఈ పురస్కారాలు మరింత ఉత్తేజాన్ని అందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాలెంపాటి శ్రీనివాస్, బోడపాటి సుబ్బారావు, హనుమంతాచారి, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గజ్జల శ్రీనివాస్, మేనం శ్యామ్, గద్దం సత్యనారాయణ కన్వీనర్లుగా వ్యవహరిస్తున్నారు. దరఖాస్తుల చివరి తేదీ ఏప్రిల్ 5, 2026గా నిర్ణయించామని , సంప్రదించవలసిన వారుమీడియా కోఆర్డినేటర్, తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ప్రతినిధులను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు 7036602022 , 9866001612 ఫోన్ నంబర్ల సైతం అందించారు.

# నీలోజిపల్లి ప్రజల కల సాకారం - సర్పంచ్ ప్రత్యేక చొరవతో సూచిక బోర్డులు ఏర్పాటు

- అనుముల భాస్కర్ కృషితో మారిన గ్రామ ముఖ చిత్రం
- గ్రామ ఆదునీకరణ దిశగా మరో ముందడుగు
- గ్రామ ప్రజలకు మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు నిరంతర కృషి - అనుముల భాస్కర్




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ప్రత్యేక చొరవతో గ్రామ అభివృద్ధిలో మరో ముఖ్యమైన అడుగు పడింది. గత కొన్నేళ్లుగా గ్రామస్తుల కలగా ఉన్న వీధి సూచిక బోర్డుల ఏర్పాటు కార్యక్రమం విజయవంతంగా పూర్తైంది. గ్రామంలోని 22 రోడ్లకు సంబంధించి మొత్తం 44 వీధులను సూచించే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, గ్రామంలోని వీధులన్నీ ఒకేలా ఉండటం వల్ల కొత్తగా వచ్చే వ్యక్తులు, అధికారులు సరైన చిరునామా గుర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఇప్పుడు ఈ సూచిక బోర్డులతో ఆ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందన్నారు. గ్రామం అభివృద్ధి దిశగా మరిన్ని మౌళిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతర కృషి కొనసాగిస్తామని, నీలోజిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా పలువురు గ్రామస్తులు సర్పంచ్ చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, "ఇప్పటివరకు మా గ్రామంలో వీధులను గుర్తించడం కష్టంగా ఉండేది. ఇప్పుడు బోర్డులు ఏర్పాటు చేయడంతో ఎవరైనా సులభంగా తమ గమ్యాన్ని చేరుకోగలుగుతున్నారు. ఇది చిన్న పని కాదు, మా గ్రామానికి ఎంతో ఉపయోగకరమైన అభివృద్ధి కార్యక్రమం" అని తెలిపారు. మరింత అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపట్టాలని సర్పంచ్‌ను కోరారు.

# తుర్కయంజాల్‌లో అక్రమ నిర్మాణాల రాజ్యం టౌన్ ప్లానింగ్ అధికారులపై అవినీతి ఆరోపణలు

- మన్నెగూడలో షెడ్ల పేరిట అక్రమ నిర్మాణాలు, ఫిర్యాదులకు స్పందన శూన్యం
- లంచాల వర్షంలో టౌన్ ప్లానింగ్.? స్థానికుల తీవ్ర ఆరోపణలు
- తుర్కయంజాల్ మున్సిపల్ సర్కిల్‌లో నియంత్రణ కోల్పోయిన అక్రమ నిర్మాణాలు
- ప్రజల ఫిర్యాదులు పట్టించుకోని అధికారులు... చర్యలు ఎప్పుడు.?
- ఒక్కో నిర్మాణానికి లక్షల్లో మాములు.? సంచలన ఆరోపణలు వెల్లువ
- అక్రమాలకు అడ్డుకట్ట ఎక్కడ.? తుర్కయంజాల్‌లో ప్రజల ఆందోళన



తుర్కయంజాల్(ప్రశ్న న్యూస్) తుర్కయంజాల్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో అక్రమ నిర్మాణాలు ఏ మాత్రం అడ్డంకులు లేకుండా సాగుతున్నాయని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మన్నెగూడ ప్రాంతంలో షెడ్ల పేరిట అనుమతులు లేకుండా నిర్మాణాలు విస్తృతంగా జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వెనుక అవినీతి ఉందన్న ఆరోపణలు స్థానికుల్లో వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన కొంతమంది అధికారులకు ఒక్కో నిర్మాణం నుంచి లక్షల రూపాయల మేర మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా అక్రమ నిర్మాణాలు మరింతగా పెరుగుతున్నాయని, దీనివల్ల పట్టణ అభివృద్ధి దెబ్బతింటోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుర్కయంజాల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైన డిప్యూటీ కమిషనర్, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రోత్సహిస్తున్న సిబ్బంది అధికారులపై చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రైతు గడపకే ప్రభుత్వం పథకాల అమలుపై క్షేత్రస్థాయిలో చీఫ్ విప్ జీవీ సమీక్ష

- అన్నదాతకు నేరుగా అండ -- మూడో విడత 'అన్నదాత సుఖీభవ'పై చీఫ్ విప్ పరిశీలన
- వినుకొండను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా జీవీ ఆంజనేయులు చర్యలు
- రైతు సమస్యలపై నేరుగా స్పందన -- ఇంటింటి ప్రచారంతో ప్రభుత్వ పథకాల వివరణ



**వినుకొండ(ప్రశ్న న్యూస్)** నియోజకవర్గంలోని నూజెండ్ల మండలం పుచ్చనూతల పంచాయితీ పరిధిలోని రాముడిపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విస్తృతంగా పర్యటించారు.'రైతన్న మీకోసం' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ, ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులతో నేరుగా మమేకమై వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించిన చీఫ్ విప్ , 'అన్నదాత సుఖీభవ' మూడో విడత నిధులు అందాయా లేదా అన్న విషయాన్ని స్వయంగా పరిశీలించి, అందిన లబ్ధి రైతులకు ఎంత మేర ఉపయోగపడిందో తెలుసుకున్నారు. అలాగే 'పి యం కిసాన్' పథకం అమలుపై కూడా సమీక్షించారు.అనంతరం పంట పొలాలను సందర్శించి, ప్రకృతి వ్యవసాయం, పంటల పరిస్థితులపై రైతులతో చర్చించారు. వినుకొండను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చీఫ్ విప్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అధికారులు, రైతులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్రను ఉత్తుత్తి ఆంధ్రగా మార్చి అభివృద్ధిని అడ్డుకున్నారు:ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

- సమాజం పట్ల, తల్లి, చెల్లి పట్ల కనికరం లేనివాడు నాయకుడిగా ఎలా రాణిస్తాడు?
- రాష్ట్ర ఆడబిడ్డగా అన్యాయం జరిగితే అండగా నిలిచే బాధ్యత టీడీపీది



**మంగళగిరి (ప్రశ్న న్యూస్)** గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 'ఉత్తుత్తి ఆంధ్ర'గా మారి, విధ్వంసానికి గురైన ఉత్తరాంధ్ర ప్రాంతం, నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. కేవలం రెండేళ్లు కూడా పూర్తికాకముందే ఉత్తరాంధ్రను పారిశ్రామిక హబ్‌గా మార్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చేలా దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు శంకుస్థాపన చేయబోతున్నారు. దాదాపు 1.5 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును 2029 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ఉంది. ఈ ఒక్క పరిశ్రమ ద్వారానే దాదాపు లక్ష మందికి పైగా నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ఏడాది జూన్ నాటికి ప్రారంభం కాబోతోంది. స్టీల్ ప్లాంట్, ఎయిర్‌పోర్ట్ ఈ రెండు ప్రాజెక్టులు ఉత్తరాంధ్ర అభివృద్ధికి రెండు కళ్ల వంటివని, ఇవి భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఉత్తరాంధ్ర వనరులను దోచుకున్నారు తప్ప, ఇక్కడి యువతకు ఉపాధి కల్పించాలనే ఆలోచన చేయలేదు. నాడు మనోభావాలను దెబ్బతీసేలా పాలన సాగింది. కానీ నేడు చంద్రబాబు పాలనా అనుభవం, విజన్ వల్ల రెండేళ్లు కాకముందే ఫలితాలు కనిపిస్తున్నాయని అన్నారు.ఇలాంటి వ్యక్తులను, వారికి మద్దతు ఇచ్చే నాయకులను ప్రజలు సామాజికంగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

## రైతుల లాభదాయక పరిశ్రమలపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- వ్యవసాయ రంగానికి ఉత్తమమవనున్న ఆయిల్ పామ్ పరిశ్రమ
- బోయినిపల్లి ఏఎంసీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్
- రైతు మహోత్సవానికి భారీగా తరలి వెళ్లిన రైతులు



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా, నర్మెట్టలో నిర్వహించిన రైతు మహోత్సవంలో భాగంగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు, బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం బోయినిపల్లి మండల రైతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో భారీ సంఖ్యలో తరలివెళ్లారు.ఈ సందర్భంగా బోయిని ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు లాభదాయకమైన పంటలను ప్రోత్సహించడంతో పాటు, ఆయిల్ ఫామ్ వంటి పరిశ్రమల ఏర్పాటు ద్వారా వ్యవసాయ రంగానికి కొత్త అవకాశాలు తీసుకువస్తున్నారని తెలిపారు. ఈ ఫ్యాక్టరీ స్థాపనతో స్థానిక రైతులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆదాయం కూడా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అలాగే రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆధునిక వ్యవసాయ విధానాలను అవలంబించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మార్గదర్శకత్వంలో బోయినిపల్లి మండల రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రణీత, బోయినిపల్లి గ్రామ సర్పంచ్ నల్లమోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్మనబోయిన సువిన్ యాదవ్, బోయిని మల్లేశం, గుంటి జలంధర్ తదితరులు పాల్గొన్నారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమానికి ఊతమిచ్చారు.

# "తీస్మార్ ఖాన్ తీరు మారదు" అడ్డుగోలు ఎంట్రీతో ఎంజాయ్

- బోయిన్ పల్లి మార్కెట్ లో వాస్తవాలు రాసిన,ఇసుకంత చర్యలుండవు
- అలీబాబా అరడజనులో ఎవరెవరు,వాటాలతో వాలీ బాల్ ఆడుతుంది ఎవరు.?
- ముసపేట్ లైన్లో మనసకబారుతున్న అధికారుల పరివేక్షన, రెచ్చిపోతున్న రెడ్ బాయ్స్ ఆగడాలు
- "తక్ పట్టి"ఎంట్రల మాయాజాలం,అందిన కాడికి దోచేయడం పరిపాటైపోయింది
- "39"లైసెన్స్ దారుల లీలలు అంత ఇంత కాదయా,షాపు నెంబర్,ఫారం పేరు లేకపోవడంతో నేరాలకు వేదికైంది
- బోయిన్ పల్లి మార్కెట్ లో అడ్డదారిలో వ్యాపారం, అయితే కోటీశ్వరులు, లేకపోతే అప్పుల అప్పారావులు.?







**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో వ్యాపార మాయా బజార్.? అసలు,నకిలీ కనుక్కోవడం అంత ఆషామాషీ వ్యవహారం కాదు!ఒక్కోక్కసారి నకిలీ బాబులు నయా ట్రెండ్ చూసి అధికారులు సైతం షాక్ అవుతారు.సికింద్రాబాద్ మోండా మార్కెట్ అన్ని రంగాల వ్యాపారస్థులను ఇబ్బందులకు గురి చేస్తుందని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి పార్టీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుమల గిరి మండలంలో ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబర్:81,82/పీ లో గల ఇరవై మూడు ఎకరాల పదిహేడు గుంటల స్థలాన్ని వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ కి 2001 డిసెంబర్ 20 న అప్పజెప్పారు.అయితే దేశంలో ఎక్కడా లేని విధంగా ట్రేడర్స్ కి "ఓనర్ షిప్ " వెసులుబాటు కల్పించారు. అలాగే మోండా మార్కెట్ నుంచి సుమారు మూడు విడతల్లో "94"మందికి లాట్రి పద్దతి ద్వారా షాపులు అందజేశారు.ఈ విధంగా సికింద్రాబాద్ నుంచి బోయిన్ పల్లి మార్కెట్ కి బదిలీ అయ్యింది.ఇంత వరకు బాగానే ఉన్నా బోయిన్ పల్లి మార్కెట్.2013 లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి ముఖేష్ కుమార్ గౌడ్ "44" లైసెన్స్ లు కొత్తవి జారీ చేసిన విషయం విదితమే!అందజేసిన కొత్త లైసెన్స్ లకు నిరసనగా కొన్ని రోజులు "94"మంది కమీషన్ ఏజెంట్లు ధర్నా నిర్వహించారు.అనంతరం "39"లైసెన్స్ దారులు కోర్టు మెట్లు ఎక్కలాల్సిన పరిస్థితి నెలకొంది.కాలక్రమేనా గొడవలు సర్ధి మణిగి, అందరూ వ్యాపారంలో తల మునకలైయ్యారు.అయితే "39"ట్రెడర్స్ అంశం కోర్టు పరిధిలో ఉండడంతో మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు షాపులు,ఫారం పేరు,నెంబర్ లు ఇవ్వకపోవడంతో బోయిన్ పల్లి మార్కెట్ లో ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ కూరగాయల వ్యాపారం కొనసాగించారు 39 లైసెన్స్ దారులు.ఈ నేపథ్యంలో అసలు క్రైం ఇక్కడే చోటు చేసుకుంది."39"లైసెన్స్ లు "సోల్ట్ ప్రొపర్టర్"విధానాన్ని కలిగి ఉండడం,అంటే ఈ లైసెన్స్ ఎవ్వరికి విక్రయించడం నేరంగా పరిగణిస్తారు.అది చెల్లు బాటు కాదు.అదిగాక మార్కెటింగ్ డిపార్ట్మెంట్ జారీ చేసిన కంపెనీ,యాజమాని పేరు మారదు.ఆయినా కూడా కొంతమంది కమీషన్ ఏజెంట్లు లక్షల రూపాయలకు ఆశ పడి లైసెన్స్ న్నీ విక్రయించారు.వ్యవసాయ మార్కెటింగ్ చట్టం పై అవగాహన లేని వ్యక్తులు కొనుగోలు చేసి, బోయిన్ పల్లి మార్కెట్ లో "కాలా దందా "కి తెర లేపారు.విశ్వసనీయ సమాచారం మేరకు సుమారు "39" లో "16" అమ్మేసి నట్లు సమాచారం.కొన్నవాళ్లు లక్షల నుంచి కోట్లు సైతం ఖర్చు చేసి లైసెన్స్ లు కొని ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియక మనోవేదనకు గురవుతున్నారు.మరికొందరుఅయితే ప్రాబ్లం పక్కకు పెట్టు అంటూ సరికొత్త ఆలోచనలతో ముందుకు పోతున్నారు.అదేంటంటే కండ బలం,బుద్ధి బలం,ఆర్థికంగా ఉంటే చాలు అధికారులను పక్కదోవ పట్టిస్తూ ఇద్దరికీ అడ్డదారిలో కిరాయికి,"తక్ పట్టి"లో ఎంట్రీ చేయిస్తూ చెయ్యి నిండా సంపాదిస్తున్నారు.ఈ నేపథ్యంలో ముసపేట్ లైన్లో కంటికి కనిపించే నేరాలు జరుగుతున్నప్పటికీ సూపర్వైజర్ల అండదండలతో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వెదజల్లుతుంది.ఉదాహరణకు "39"లైసెన్స్ లో గేట్ ఎంట్రీ అయితే వారి వివరాలు"39"లైసెన్స్ అని ఎంట్రీ అవుతుంది తప్ప కమీషన్ ఏజెంట్ పేరు,షాపు నెంబర్ వివరాలు నమోదు కావు! దీన్నే అదునుగా మార్కెట్ అధికారులు సైతం వారికి సపోర్ట్ చేస్తూ వారి జోబు నింపుకునే పనిలో ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. అయితే ఈ గుట్టు రట్టైయ్యేతే ఉన్నత అధికారులు రైడ్ చేస్తే గానీ వాస్తవాలు వెలుగులోకి రావు.అప్పటిదాక ఈ ముసుగులో చీకటి దందాకు ఢోక లేదు.మరో విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ లో "94"మంది కమీషన్ ఏజెంట్లల్లో ఉన్న వారు (ముసపేట్ లైన్లో) శ్రీ పూజ కార్పొరేషన్ షాపు:24. దుకాణం నెంబర్:25 సర్కార్ షాపు ఇక్కడ ఎవరు కూరగాయల వ్యాపారం చేస్తున్నారు,వీరికి ఇక్కడ వెసులుబాటు కల్పించింది ఎవరు ? ఎంబిఏ: మిర్జా అశ్రఫ్ అలీ బాగ్ దుకాణం:26/1.శ్రీ మాణిక్ ప్రభు 26/2.బిఎంఆర్ ఏ :27/1.వైఎస్సార్ ఏ:27/2.ఆర్కే ఏ:28/1.ఎస్బీఎం ఏ:28/2.సుమారు ఎనిమిది షాపులు ఉండగా వీటి ముందు కొందరికి కిరాయి ఇయ్యడమే కాకుండా,ఈ యాజమానులే కూతవేటు దూరంలో మరో కొందరికి కిరాయి ఇచ్చి రెండు చేతుల సంపాదిస్తున్నారు.వీరి పై నిఘా పెట్టాల్సిన సిబ్బంది,యార్డ్ ఇంచార్జ్ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.అంటే ఎన్ని రకాల నేరాలు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో చోటు చేసుకుంటున్నాయో అర్థం చేసుకోవచ్చు.వీటిని అరి కట్టడం ఎవరి తరం కాదని స్పష్టం అవుతోంది.ఎందుకంటే ఇవాళ నిన్న చోటు చేసుకున్న వ్యవహారం కాదు గత కొన్నేళ్లుగా జరుగుతున్న ఆనవాయితి.కానీ ఈ కేటుగాళ్లే ముదుర్లు గురూ. ముసపేట్ లైన్లో "బొందలను మాయ చేశారు,చూట్టు ఉన్న కంచెను,త్రాగునీరు ట్యాంక్ తొలగించారు.మరుగుదొడ్ల నామరూపం లేకుండా జాగ్రత్త పడ్డారు.ఈవె గాక ఈ మధ్య నాలా పై కప్పు పై చోరీ చేసిన బిల్లలు(సిమెంట్ కవర్లు) వేసి ఎంచక్క కిరాయికి ఇచ్చి సొంత వ్యాపారానికి తెర లేపారు.అలాగే అందరూ ఆశ్చర్యపోయ్యే విషయం ఏమిటంటే గ్రేన్ మార్చేంట్స్ షాపుల్లో సైతం కూరగాయల వ్యాపారం చేస్తూ మాకేవరు సాటి లేరు అంటూ ఫోజులు కొడుతూ జోబులు నింపుకుంటున్నారు.మరో విషయం"బయో గ్యాస్ కేంద్రాన్ని "కూడా వదలని మేధావులు.అక్కడ కూడా భయంకరమైన వ్యాపారం చేస్తూ,అమ్మయములతో ఎవరిని ఆనంద పెడుతున్నారో అర్థం కాని వ్యవహారం.వీటన్నింటికి భిన్నంగా ఉండే విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ లో"తక్ పట్టి ఎంట్రీ " గోళ అధికారులకు పట్టదు ? అసలు క్రైం చోటు చేసుకుంటుంటే ఇక్కడ ఈ సూక్ష్మాన్నీ మార్కెట్ అధికారులు ఎందుకు గ్రహించకలేకపోతున్నారో ఎవ్వరికీ అర్థం కాని విషయం. కానీ అర్థం అయినది ఏమిటంటే, నెంబర్ వన్:"గేట్ ఎంట్రీ", నెంబర్ టూ:బిడ్డింగ్, నెంబర్ త్రీ:ఏరియా సూపర్వైజర్ పరివేక్షన లోపం. మొత్తానికి బోయిన్ పల్లి మార్కెట్ లో "39"లైసెన్స్ దారులను ఓ కొలిక్కి తీసుకువచ్చే నాథుడే లేడని మార్కెట్ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపడుతే ఊహకందని నిజాలు వెలుగు చూస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.బోయిన్ పల్లి మార్కెట్ కి ప్రతి రోజూ పదిహేడు రాష్ట్రాల నుంచి వివిధ రకాల కూరగాయలు దిగుమతితో పాటు,ఇరవై ఏడు టన్నుల కూరగాయలు దిగుమతి అవుతున్నాయని సమాచారం.అలాగే సగటున ప్రతి రోజూ మార్కెట్ కి ఇరవై ఐదు వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు.ముఖ్యంగా ఉదయం 4:30 నుంచి 11:30 వరకు కూరగాయలు విక్రయాలు జోరుగా సాగుతోంది.ఈ ప్రక్రియలోనే జాదుగాళ్లు మార్కెట్ లో ఉన్న లైసెన్స్ దారులు నుంచి అంతర్గత ఒప్పందం కుదిరి.ప్రతి నెల కిరాయి ఇరవై ఐదు వేల నుంచి ముప్పై వేల రూపాయలు కేవలం"తక్ పట్టి"ఎంట్రీ కోసం చెల్లించే డబ్బులు.అయితే ఇక్కడే అసలు గుట్టు దాగుంది,ఎంట్రీ ఒక కాడ కూరగాయలు విక్రయాలు మరో చోట.కేవలం గేట్ ఎంట్రీ కోసం చెల్లించే కాసులతో కమీషన్ ఏజెంట్లు లక్షలు కూడగట్టుకుంటున్న విశ్వసనీయ సమాచారం.?

**(శుక్రవారం ప్రజా ప్రశ్న న్యూస్)**
**"తక్ పట్టి గోల్ మాల్" లైసెన్స్ దార్ తీన్మార్.**

శీర్షిక చూసి కూడా బోయిన్ పల్లి మార్కెట్ లో బి:51 తీరు మారలేదు.గత మూడు రోజులు గా అదే దుకాణంలో ఎంట్రీ అవుతుంది అంటే అధికారుల పై నమ్మకం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుంది."బి:51 షాపు యజమాని"తక్ పట్టి "లో ఎంట్రీ అవుతూ మరోచోట వ్యాపారం జరుగుతుంటే "సినిమా చూస్తున్న మార్కెట్ సిబ్బంది".ఇలా కేవలం బి:51 ఒక్కటే కాదు ఇలాంటివి బోయిన్ పల్లి మార్కెట్ లో కోకొల్లలుగా దర్శనమిస్తున్నప్పటికి అధికారుల చర్యలు శూన్యం. విశ్వసనీయ సమాచారం మేరకు మార్కెట్ లో కొంతమంది కమీషన్ ఏజెంట్లు ఎంట్రీల పై పెద్ద స్థాయిలో చర్చించినట్లు సమాచారం.?

## కరీంనగర్‌లో రెనే ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరం

- బంగారి లక్ష్మీ, మైసయ్య స్మారకార్థం సేవా కార్యక్రమం
- లయన్స్ క్లబ్ సహకారంతో శిబిరం విజయవంతం





**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి కరీంనగర్ నగరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విశేష స్పందన పొందింది. రెనె ఆస్పత్రి మరియు బంగారి లక్ష్మీ మైసయ్య స్మారకార్థం శ్రీ లక్ష్మీ మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సహకారంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించబడింది.నగరంలోని జగిత్యాల వెదిరే రోడ్డులో ఉన్న వసుధ ఫంక్షన్ హాల్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను పొందారు.ట్రస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ డా. బంగారి స్వామి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ శిబిరంలో రక్తపోటు, మధుమేహం (షుగర్) తదితర సాధారణ ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.ప్రత్యేకంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఈ శిబిరం ముఖ్య ఉద్దేశంగా నిలిచింది. వైద్యుల సేవలు, శిబిరం నిర్వహణపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ట్రస్ట్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, వాలంటీర్లు చురుకుగా పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని స్థానికులు ఆకాంక్షించారు.

## కరాటే కేవలం పోరాట విద్య కాదు - జీవన నైపుణ్యం

- మార్షల్ ఆర్ట్స్ వైపు పిల్లలను ప్రోత్సహించాలి
- గత 35ఏళ్లుగా క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న అకాడమీ సేవలు అభినందనీయం
- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్






**వేములవాడ (ప్రశ్న న్యూస్ )** విద్యార్థుల్లో ధైర్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్లో ఆదివారం నిర్వహించిన ఓకినవ స్పోర్ట్స్ కరాటే అకాడమీ 35వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరాటే కేవలం పోరాట విద్య మాత్రమే కాకుండా శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, ఏకాగ్రతను పెంపొందించే సమగ్ర విద్యగా అభివర్ణించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇది బలమైన పునాది వేస్తుందని తెలిపారు. గత 35 సంవత్సరాలుగా అకాడమీ ఫౌండర్ అబ్దుల్ మన్నన్ ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడం ప్రశంసనీయమని కొనియాడారు.అనుకోని పరిస్థితుల్లో ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని, యువతలో సాహసాన్ని పెంపొందించి జీవిత సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని ఇస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్న వయసులోనే మార్షల్ ఆర్ట్స్ వైపు ప్రోత్సహించాలని సూచించారు.తదుపరి అర్బన్ కాలనీలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.కార్యక్రమం అనంతరం అకాడమీ ఫౌండర్ అబ్దుల్ మన్నన్, ఆది శ్రీనివాస్ ను పూలమాల,శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కరాటే అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కె. వసంత్ కుమార్, సీనియర్ మాస్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'పెద్ది' ఐటెం సాంగ్‌లో

# మృణాల్ ఠాకూర్..

### రామ్ చరణ్‌తో స్పెషల్ డ్యాన్స్‌కు సిద్ధమా?





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'పై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మిగిలి ఉన్న కీలక అంశాల్లో ఒకటైన ఐటెం సాంగ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు బుచ్చిబాబు సన స్పెషల్ సాంగ్ కోసం సరైన హీరోయిన్ ఎంపికపై కొంతకాల ంగా తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. మొదట ఈ పాటలో ముగ్గురు లేదా నలుగురు హీరోయిన్లను తీసుకోవాలనే ఆలోచన ఉన్నప్పటికీ, సమయం తక్కువగా ఉండటంతో ఆ ప్లాన్‌ను విరమించుకున్నట్లు సమాచారం. తాజాగా ఈ స్పెషల్ సాంగ్‌లో రామ్ చరణ్ సరసన నటించేందుకు మృణాల్ ఠాకూర్‌ని ఎంపిక చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వాస్తవానికి ఈ వార్త కొద్దిరోజుల క్రితమే వినిపించినా, అధికారికంగా ఎలాంటి క్లారిటీ లేదు. అయితే ఇటీవల మృణాల్ ఠాకూర్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు, ఆమె హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలియజేసే పోస్టులు ఈ వార్తలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. ఆమె 'పెద్ది' పాట షూట్ కోసమే నగరానికి వచ్చినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఇక మృణాల్ ప్రస్తుతం అడివి శేష్‌తో కలిసి నటిస్తున్న 'డెకాయిట్' సినిమా ప్రమోషన్లతో కూడా బిజీగా ఉన్నారు. ఏప్రిల్ 10న విడుదల కానున్న ఈ చిత్రం కోసం ఆమె డేట్లను టీమ్ ప్రత్యేకంగా ప్లాన్ చేసింది. ఈ ప్రమోషన్ల మధ్యలో లభించే గ్యాప్‌లోనే 'పెద్ది' ఐటెం సాంగ్ షూట్ పూర్తి చేయాలని యూనిట్ భావిస్తోంది.మరో ఆసక్తికర విషయం ఏమిటంటే, ఈ పాటలో మృణాల్ ఠాకూర్‌తో పాటు జాన్వీ కపూర్ కూడా కనిపించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమా నుంచి టీజర్ లేదా ట్రైలర్ రూపంలో స్పెషల్ అప్డేట్ ఇవ్వొచ్చని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇదిలా ఉండగా, 'పెద్ది' సినిమా వాయిదా పడుతుందనే ప్రచారాలకు చిత్రబృందం ఇప్పటికే చెక్ పెట్టింది. ఓవర్సీస్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానుండగా, బిజినెస్ వ్యవహారాలు కూడా క్రమంగా పూర్తి అవుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ విడుదల తేదీ మిస్ కాకూడదనే పట్టుదలతో యూనిట్ పగలు రాత్రి శ్రమిస్తోంది. రెహమాన్ అందుబాటులోకి రాగానే సెకండాఫ్ రీ–రికార్డింగ్ పనులు వేగవంతం కానున్నాయి. మొత్తం మీద అన్ని పనులు ప్లాన్ ప్రకారం సాగుతున్న నేపథ్యంలో 'పెద్ది' విడుదల వాయిదా పడే అవకాశాలు లేవనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# డ్రాగన్ కోసం కసరత్తులు



'రాఖీ' సినిమా వరకూ చాలా లావుగా ఉండేవారు తారక్. రాజమౌళి 'యమదొంగ'తో ఊహించని విధంగా స్లిమ్ అయ్యి, ప్రేక్షకులందరికీ స్వీట్ షాక్ ఇచ్చారు. ఇక అప్పట్నుంచీ మళ్లీ బరువు పెరగకుండా జాగ్రత్త పడుతూ అందంగా మారారాయన. ప్రస్తుతం ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహిస్తున్న 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్) చిత్రంలో నటిస్తున్నారు తారక్. ఈ సినిమా కోసం ఆయన మరింత తగ్గారు. ఆ మధ్య ఎయిర్‌పోర్టుల్లో, యాడ్ ఫిల్మ్‌లో చిక్కిన ఎన్టీఆర్‌ని చూసి, అభిమానులే కాదు, సగటు ప్రేక్షకులు సైతం షాక్ అ య్యారు. ఈ లుక్‌పై ఆశ్చర్యం, ఆందోళన రెండూ వ్యక్తం చేశారు .అయితే.. ఇది పాత్రకోసం చేసిన ప్రణాళికాబద్ధమైన మార్పేనని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హై–వోల్టేజ్ యాక్షన్ డ్రామా కోసం పాత్రకు తగ్గట్టు ఫిజిక్ కావాలని దర్శకుడు కోరడంతో... రోజుకు సుమారు 90 నిమిషాల పాటు ఫంక్షనల్ ట్రైనింగ్ చేస్తూ, కంట్రోల్ డైట్‌తో కేవలం 7వారాల్లో పది కేజీల బరువు తగ్గారట తారక్. ఈ విషయాన్ని ఆయన ట్రైనింగ్ టీమ్ వెల్లడించింది. మైత్రీ మూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానున్న విషయం విదితమే.

### జీవితాన్ని కళ్లకుకట్టే బయోపిక్ ఇది



మహారాష్ట్ర మహోన్నత జానపద కళాకారిణి, దేశభక్తురాలు విఠాబాయి భౌమాంగ్ నారాయణగాంకర్ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న బాలీవుడ్ పానిండియా చిత్రం 'విఠా'. ఇందులో విఠాబాయిగా శ్రద్ధాకపూర్ కనిపించనున్న విషయం తెలిసిందే. మరాఠీ దర్శకుడు సంజయ్ జాదవ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని లోక్‌మాన్య ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నది. ఇదిలావుంటే.. విఠాబాయి పాత్ర గొప్పదనం గురించి ఇటీవల శ్రద్ధాదాస్ మాట్లాడుతూ 'పుణ్యం చేసుకుంటే తప్ప ఇలాంటి పాత్రలు దక్కవు. ఈ విషయంలో నేనెంతో ఆనందిస్తున్నా, గర్విస్తున్నా. విఠాబాయి గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాత ఒక నటిగా నాకు ఇంతకు మించిన ఛాలెంజ్ మరొకటి లేదని అర్థమైంది. కళను ఓ తపస్సుగా, వేదికను ఓ దేవాలయంలా భావించిన గొప్ప కళాకారిణి విఠాబాయి.

స్టేజ్‌పై ప్రదర్శన ఇస్తుండగా ప్రసవవేదన మొదలైతే.. ఏమాత్రం తడబడకుండా, వేదిక వెనక్కు వెళ్లి, ఓ బిడ్డకు జన్మనిచ్చి, సర్జికల్ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో రాతితో బొడ్డు పేగును కోసి, బిడ్డను భద్రం చేసి, ఆ వెంటనే ఏమీ జరగనట్టుగానే తిరిగొచ్చి, మిగిలిన ప్రదర్శనను పూర్తిచేసిన గొప్ప కళాకారిణి విఠాబాయి. భారత్–చైనా యుద్ధ సమయంలో ఆమె కళారూపాలు జనంలో దేశభక్తిని పురిగొల్పాయి. యుద్ధభూమిలో అలసిన సైనికులకు విఠాబాయి ప్రదర్శనలు మానసిక ఉల్లాసాన్నిచ్చాయి. జానపద కళల్ని బతికించడం కోసం ఆమె పడ్డ తపన, ఎదుర్కొన్న పేదరికం, సామాజిక వివక్ష ఇవన్నీ ఈ బయోపిక్ కళ్లకు కడుతుంది' అని తెలిపింది శ్రద్ధాకపూర్.

# ప్రతి ఇంట్లో జరిగే కథ



డాక్టర్ రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్‌శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయిప్రణీత, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన పాత్రధారులుగా, మహేశ్‌చంద్ర దర్శకత్వంలో రూపొందిన కుటుంబకథాచిత్రం 'పిఠాపురంలో'. 'అలా మొదలైంది' అనేది ఉపశీర్షిక. దుండిగళ్ల బాలకృష్ణ, ఆకుల సురేశ్ పటేల్, ఎఫ్‌ఎం మురళి(గోదావరి కిట్టయ్య) నిర్మాతలు. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. దర్శకుడు చంద్రమహేశ్ బ్లాక్‌బస్టర్ 'ప్రేయసిరావే' టీమ్ హీరో శ్రీకాంత్, పృథ్వీ, శివాజీరాజా, ఎంఎం శ్రీలేఖ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి ట్రైలర్‌ని లాంచ్ చేశారు. తదనంతరం చిత్రబృందానికి వారంతా శుభాకాంక్షలు అందించారు. 'నాకు దర్శకుడిగా లైఫ్ ఇచ్చిన సినిమా 'ప్రేయసి రావే'. ఆ టీమ్ ఈ ట్రైలర్‌ని ఆవిష్కరించడం ఆనందంగా ఉంది. 'పిఠాపురంలో' సినిమాను కొందరు శ్రేయోభిలాషులకు చూపించాను. చూసినవారంతా ఎమోషనల్ అయ్యారు. సినిమాకు పనిచేసినవారంతా ప్రాణం పెట్టేశారు. ప్రతి ఇంట్లో జరిగే సంఘటనలే ఈ కథలో ఉంటాయి. చూస్తున్నంతసేపూ అవన్నీ తమ ఇంట్లోనే జరిగినట్టు ఫీలవుతారు. అలాంటి గొప్ప సినిమా ఇది' అని దర్శకుడు మహేశ్‌చంద్ర అన్నారు. సకుటుంబంగా చూడదగ్గ సినిమా ఇదని నిర్మాత సురేశ్ పటేల్ చెప్పారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

# నిజాయతీగా చేసిన ప్రయత్నం



కొత్త ప్రతిభను పరిచయం చేయాలనే దృక్పథంతో హీరో కిరణ్ అబ్బవరం తన కేఏ ప్రొడక్షన్స్ పతాకంపై సుమైనా స్టూడియోస్‌తో కలిసి నిర్మిస్తున్న వైవిధ్యకథాచిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. సాయితేజ్, వేద జలంధర్ జంటగా నటిస్తున్నారు. వి.మునిరాజు దర్శకుడు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ డ్రామా ఏప్రిల్ 17న థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో గ్రాండ్ రివీల్ ఈవెంట్‌ని నిర్వహించారు. చిత్ర నిర్మాత కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'ఈ కథంతా 1995లో జరుగుతుంది. ఇది దర్శకుడు మునిరాజు ఊరికథ.కథ చెప్పే ముందే తాను రెగ్యులర్ కమర్షియల్ సినిమా చేయాలనుకోవడంలేదనీ, తన ఊరి జనాల ఇన్నోసెన్స్, వారిమధ్య జరిగే డ్రామా, టీవీకి అప్పట్లో ఉన్న ప్రాధాన్యత.. ఈ నేపథ్యంలో సినిమా చేయాలనుకుంటున్నాననీ చెప్పాడు. ఇది హానెస్ట్‌గా మేమంతా చేసిన ప్రయత్నం. 90 కిడ్స్‌కు అయితే ఈ సినిమా తెగ నచ్చేస్తుంది. సాంకేతికంగా అన్ని విధాలా సినిమా బావుంటుంది. ఒక మంచి సినిమా నిర్మించినందుకు గర్వంగా ఉంది' అని అన్నారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు. ప్రదీప్ కొట్టె, స్వాతి కరిమిరెడ్డి, అమ్మ రమేష్, సత్యనారాయణ, లతీష్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అక్షయ్ రామ పొదిశెట్టి, సంగీతం: వంశీకాంత్ రేఖన.

## హీరోలకి పోటీ ఇస్తున్న

# లేడీ సూపర్ స్టార్..



### నయనతార సంపద చూసి ఆశ్చర్యపోతున్న నెటిజన్స్!

సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోల పారితోషికాలు, వారి లైఫ్ స్టైల్ గురించి ఎక్కువగా చర్చలు జరుగుతుంటాయి. అయితే ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న లేడీ సూపర్ స్టార్ నయనతార ఆస్తుల వివరాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాకుండా, లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద వరుస విజయాలు అందుకుంటూ నయనతార తన ప్రత్యేకతను నిరూపించుకుంది. ఆమె నటించిన సినిమాలు వసూళ్ల విషయంలో స్టార్ హీరోల సినిమాలకు సాటిగా నిలుస్తుండటంతో, ఆమె క్రేజ్ రోజురోజుకు పెరుగుతోంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం సౌత్ ఇండియాలో అత్యంత సంపన్న హీరోయిన్‌గా ఆమె పేరు మారుమోగుతోంది.తాజా సమాచారం ప్రకారం, నయనతార వ్యక్తిగత ఆస్తుల విలువ సుమారు రూ.300 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఒక్కో సినిమాకు రూ.10 కోట్లకు పైగా పారితోషికం తీసుకుంటున్న ఆమె, తన కెరీర్‌ను అద్భుతంగా ప్లాన్ చేసుకుంటూ ముందుకు సాగుతోంది. నటిగా మాత్రమే కాకుండా, వ్యాపారవేత్తగా కూడా తన ప్రతిభను చాటుకుంటోంది. తన సొంత ప్రొడక్షన్ హౌస్ ద్వారా సినిమాలు నిర్మిస్తూ భారీగా లాభాలు ఆర్జిస్తున్న నయనతార, రియల్ ఎస్టేట్ రంగంలోనూ పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టింది. చెన్నై, హైదరాబాద్, ముంబయి వంటి ప్రధాన నగరాల్లో ఖరీదైన ఇళ్లు, ఆస్తులు ఆమె సొంతమని సమాచారం. ఇవన్నీ ఆమె సంపదను మరింత పెంచుతున్నాయి.ఇంకా విశేషమేమిటంటే, ఆమెకు సుమారు రూ.50 కోట్ల విలువ చేసే ప్రైవేట్ జెట్ విమానం కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. ఇది ఆమె లైఫ్ స్టైల్‌ను మరింత హైలైట్ చేస్తోంది.

అయితే ఈ స్థాయికి చేరుకోవడానికి కారణం ఆమె క్రమశిక్షణ, సినిమాల ఎంపికలో చూపుతున్న జాగ్రత్త, అలాగే తన కెరీర్‌పై ఉన్న స్పష్టమైన దృష్టి అని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దశాబ్దానికి పైగా ఇండస్ట్రీలో తన స్టార్డమ్‌ను కొనసాగిస్తూ, గ్లామర్ మరియు పర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న నయనతార, ఇప్పుడు కేవలం హీరోయిన్‌గా కాకుండా ఒక బ్రాండ్‌గా ఎదిగింది. పారితోషికం, ఆస్తులు రెండింటిలోనూ ఈ స్థాయిని సాధించడం అరుదైన విషయం కావడంతో, ఆమె విజయగాథ చాలా మందికి ప్రేరణగా నిలుస్తోంది.

# ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు

**- ప్రార్థనలో పాల్గొన్న ముస్లిం సోదరులు**



**మర్రిగూడ(ప్రశ్న న్యూస్)** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.ఇందులో భాగంగా శనివారం మర్రిగూడ మండలం పరిధిలోని ఈద్గాల వద్దకు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు మొహమ్మద్ యాసిన్ పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమన్నారు.ప్రతి ఏడాది హిందూ, ముస్లిం సోదరులు కలిసి ఇక్కడ రంజాన్ పర్వదినాన్ని జరుపుకొని మతసామరస్యాన్ని చాటుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు.30 రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు ఉండి అల్లా అనుగ్రహం పొందుతారని తెలిపారు.ఆ అల్లా చల్లని దీవెనలతో చక్కగా వర్షాలు కురిసి,పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అదేవిధంగా స్థానిక సర్పంచ్ వీరమళ్ళ శిరీష లోకేష్ గౌడ్ మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యం ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉప సర్పంచ్ మహేశ్వరం రమేష్ చెరుకు శ్రీరాములు, నల్ల యాదయ్య, నల్ల శేఖర్, మైనారిటీ నాయకులు అబ్దుల్ జబ్బార్, రజాక్, మొహమ్మద్ మోసిన్, అబ్దుల్ సలీం, షార్ఫుద్దీన్, అశ్వక్, యునుస్, మొహమ్మద్ జబ్బార్, అశ్రఫ్ పర్వేజ్, ఆసిమ్, జమ్మా, ఇర్ఫాన్, ఫహీం, వాహెద్, జీషన్, వాజీద్, రషీద్, నాదీమ్, మన్నన్, అసిఫ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు, మండల పరిధిలో వివిధ గ్రామాలలో ముస్లిం సోదరులు , చిన్న పిల్లలు ఒకరికొకరు అలీంగనం చేసుకుంటూ ఆహ్లాదకరమైన,ఆధ్యాత్మిక వాతావరణంలో రంజాన్ వేడుకలను జరుపుకున్నారు.

# న్యాయం కావాలి

**- భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వం మనల్ని మోసం చేస్తోంది అంటూ విలేకరుల సమావేశంలో సత్యం గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని సూటిగా ఒక ప్రశ్న అడుగుతున్నానని, ఇది నేనే కాదు అందరూ కూడా అడగాల్సిన ప్రశ్నఅని, ఎందుకంటే మనం మోసపోతున్నాం. హౌస్ టాక్స్ ఇంటి పన్ను విషయంలో ప్రభుత్వం ప్రజలని మోసం చేస్తుందన్నారు. అంటే ఇప్పుడు మనకు గవర్నమెంట్ నల్ల నీళ్లు ఇస్తుంది కాబట్టి నల్ల టాక్స్, నల్లబిల్లు కట్టాల్సిందే. కరెంటు కూడా ఇస్తున్నారు కాబట్టి కరెంటు బిల్లు కట్టవలసిందే, పొద్దున్నే చెత్త వాడు వచ్చి చెత్త తీసుకెళ్తాడు, కాబట్టి చెత్త కూడా బిల్లు కట్టొచ్చు అది ఒకే కానీ, మన ఇంటికి గవర్నమెంట్ ఏం చేస్తుందని ప్రతి సంవత్సరం ఇంటి టాక్స్ కట్టాలి. ల్యాండ్, స్థలం కొనుక్కునేటప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి పైసలు కట్టి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాము. ఇల్లు కట్టుకునేటప్పుడే పర్మిషన్ల కోసం అని చాలా పైసలు కడుతున్నాము. ఒకవేళ ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ వేస్తే దానికి తగ్గట్టుగా పర్మిషన్ తీసుకుని అమౌంట్ కడుతూనే ఉన్నాము. అయినప్పటికీ కూడా ప్రభుత్వం ఏమి చేస్తుందని మనం సంవత్సరానికి ఒకసారి ఇంటి టాక్స్ కట్టాలి. మనదేమైనా రాచరికమా, ప్రజాస్వామ్యమా, పరాయి పాలనలో ఉన్నట్టు అనిపించట్లేదా అని భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్ ప్రశ్నించారు .కాబట్టి ప్రతి ఒక్కరు కూడా ఈ విషయమై ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది కాబట్టి ప్రతీ ఒక్కరు ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిందిగా నేను కోరుతున్నానని, ప్రభుత్వాశీ కూడా ఈ ఇంటి టాక్స్ ను తీసేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నానన్నారు.

# అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న: హోం మంత్రి అనిత



అనకాపల్లి(ప్రశ్న న్యూస్)ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పుగా, కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పేరుగాంచిన అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో కొత్త అమావాస్య వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర హోం మంత్రి అనిత, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోం మంత్రి అనితకు ఆలయ అధికారులు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు మంత్రి అనితకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి, తీర్థప్రసాదాలు సమర్పించారు. నెల రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతున్న నూకాలమ్మ అమ్మవారి జాతరకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా, వారి సౌకర్యాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంది.ఈ సందర్భంగా మంత్రి అనిత క్యూ లైన్లో ఉన్న భక్తులతో మాట్లాడి, ఏర్పాట్లపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# హనుమంత వాహనంపై శ్రీరాముడి తేజసం



తిరుపతి(ప్రశ్న న్యూస్) శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఆదివారం ఉదయం 8 గంటలకు స్వామివారు హనుమంత వాహనంపై అభయమిచ్చారు.గజరాజులు, వృషభాలు, అశ్వాలు ముందు కదులుతుండగా, భజన బృందాలు కోలాటాలు ఆడుతుండగా స్వామివారు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించారు.త్రేతాయుగంలో రామభక్తునిగా, భగవద్భక్తులలో అగ్రగణ్యుడుగా ప్రసిద్ధిగాంచిన వాడు హనుంతుడు. హనుమంతుడు తనను సేవించే భక్తులకు ఆత్మోన్నతిని ప్రసాదిస్తున్నాడు.అనంతరం ఉదయం 10.30 గంటల నుండి శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరాములవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు.రాత్రి 7 నుండి 8.30 గంటల వరకు గజ వాహనంపై రాములవారు భక్తులకు కనువిందు చేయనున్నారు.వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, డెప్యూటీ ఈవో నాగరత్న, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి కంటే ముందుగానే నెల్లూరు రూరల్ లో అభివృద్ధి పనుల జాతర : మంత్రి ఆనం

**- నెల్లూరు రూరల్ లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తో కలిసి 240 అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి ఆనం**

**- స్వశక్తితో ఎదిగిన నాయకుడు కోటంరెడ్డి కోటంరెడ్డి సోదరులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం**

**- జనగణన పూర్తయ్యాక మూడు అసెంబ్లీ నియోజకవర్గాలుగా నెల్లూరు**

**- ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం**

**నెల్లూరు (ప్రశ్న న్యూస్)** నియోజకవర్గంలోని పడారుపల్లిలో అభివృద్ధి పనుల జాతరను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సోదరుల సమష్టి కృషితో రూ.27 కోట్ల వ్యయంతో చేపట్టిన 240 అభివృద్ధి పనులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి, ఎంపీకి కోటంరెడ్డి సోదరులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ . శ్రీరామనవమికి ముందుగానే నెల్లూరు రూరల్‌లో అభివృద్ధి పనుల జాతర ప్రారంభించడం ఆనందదాయకమని అన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని ప్రశంసించారు. నెల్లూరు రూరల్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఇది ఒకప్పుడు తాను ప్రాతినిధ్యం వహించిన రాపూరు నియోజకవర్గ పరిధిలో భాగమని గుర్తుచేశారు. ఎమ్మెల్యేకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రూరల్ అభివృద్ధిలో అందరం భాగస్వాములమవుతామని స్పష్టం చేశారు. నగరాభివృద్ధి కోసం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమన్వయంతో మేయర్, డిప్యూటీ మేయర్ నిధులను సమీకరించి నగర కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచాలని సూచించారు.దేవాదాయశాఖ పరంగా రూరల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, 29 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద ప్రతి నెలా ?10,000 చొప్పున సహాయం అందిస్తున్నామని చెప్పారు. నాలుగు పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి ?10.40 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా కొత్త ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 5,000 పైగా ఆలయాలను ?700 కోట్లతో నిర్మిస్తున్నామని వివరించారు. 2027లో గోదావరి, 2028లో కృష్ణ పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడ్కో ఛైర్మన్ అజయ్, నగర మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మేయర్ భాను శ్రీ, స్థానిక కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



# మార్చి 30 నుండి నుండి ఏప్రిల్ 01వ తేదీ వరకు తిరుమల శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి ఆలయంలో మార్చి 30 నుండి ఏప్రిల్ 01 తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి.

ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. మార్చి 30వ తేదీన ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారు నాలుగు మాడవీధులలో ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఇక్కడ వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు.రెండవరోజు మార్చి 31న శ్రీ భూ సమేత శ్రీ మలయప్పస్వామివారు ఉదయం 8 నుండి 10 గంటల వరకు బంగారు రథాన్ని అధిరోహించి తిరుమాడ వీధులలో ఊరేగుతారు. అనంతరం వసంత మండపంలో అర్చకులు వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు.చివరిరోజు ఏప్రిల్ 01న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారితో పాటుగా శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవర్లు, శ్రీ రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి సాయంకాలానికి ఆలయానికి చేరుకుంటారు.ఈ సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. కాగా ప్రతి రోజు సాయంత్రం 6 నుండి 6.30 గంటల వరకు ఆస్థానం ఘనంగా నిర్వహిస్తారు.వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఈ క్రతువులో సుగంధ పుష్పాలను స్వామికి సమర్పించటమే కాక వివిధ ఫలాలను కూడా నివేదించడం ఈ వసంతోత్సవంలో ప్రధాన ప్రక్రియ.వసంతోత్సవాన్ని పురస్కరించుకొని పలు సేవలు రద్దు చేసిన టిటిడి. వసంతోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో మార్చి 30 నుండి ఏప్రిల్ 01వ తేదీ వరకు మూడురోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను, మార్చి 31న అష్టదళ పాద పద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది

# పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సన్మాన కార్యక్రమం

**- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**




విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) పోర్ట్ యాదవ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవీ విరమణ చేసిన పలువురు ఉద్యోగులకు షష్టిపూర్తి సన్మాన సభ శివాజీపాలెం రోడ్ లో గల సవేరా ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని, వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం ఒత్తిడి తో కూడుకున్నాదని అన్నారు. ఇప్పటి నుంచి కుటుంబ సభ్యుల తో ఆహ్లాదంగా గడపాలని, ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, యాదవ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకుంటున్న ప్రాణదాత


**- పల్లా శ్రీనివాసరావు సేవలకు ప్రజల ప్రశంసలు**



గాజువాక (ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ "నేనున్నాను" అనే భరోసాతో ప్రాణదాతగా ప్రజల మన్ననలు పొందుతున్నారు.పెదగంట్యాడ మండలం 76వ వార్డు హెచ్‌బీ కాలనీకి చెందిన 21 సంవత్సరాల నాగ సౌందర్య లహరి మజిల్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. తండ్రి ఆటో డ్రైవర్ కాగా, కుటుంబానికి వైద్య ఖర్చులు భరించే స్థోమత లేకపోవడంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్వయంగా ఆటో వద్దకు వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, హోలీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి అవసరమైన వైద్య ఖర్చులను ప్రభుత్వం ద్వారా భరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఇదిలా ఉండగా, ఇటీవల అనకాపల్లి జిల్లా చీడికాడ ప్రాంతానికి చెందిన ఓ తెలుగు విద్యార్థి అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో తీవ్రమైన వ్యాధితో బాధపడుతున్న విషయం తెలిసిన వెంటనే పల్లా శ్రీనివాసరావు స్పందించారు. ఈ విషయాన్ని నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా, అతన్ని అమెరికా నుండి హైదరాబాద్‌కు తరలించి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం అతన్ని స్వగ్రామానికి సురక్షితంగా చేరేలా చూసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు.ఈ రెండు ఘటనలలోనూ పల్లా శ్రీనివాసరావు చూపిన స్పందన ప్రజల్లో విశేషంగా చర్చనీయాంశమైంది. ఎలాంటి ఆపదలో ఉన్నా తాను అండగా ఉంటానని ఆయన ఇచ్చే భరోసా, సేవా భావం ప్రజలకు నమ్మకాన్ని కలిగిస్తోంది. దీంతో ఆయనను ప్రజలు "ఆపద్బాంధవుడు "ప్రాణదాత"గా కొనియాడుతున్నారు.

# నక్కపల్లి మండలం, చందనాడ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ

**- ట్రాఫిక్ నిబంధనలు ప్రజలకు సూచనలు**



అనకాపల్లి(ప్రశ్న న్యూస్ )నక్కపల్లి మండలం, చందనాడ గ్రామంలో నిర్వహించనున్న ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి , కేంద్ర రాష్ట్ర మంత్రులు విచ్చేస్తున్న సందర్భంగా, జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన భద్రత ట్రాఫిక్ ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ కార్యక్రమానికి వచ్చే ప్రజలు, పార్టీ కార్యకర్తలు వాహన చోదకులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఈ క్రింది సూచనలను పాటించవలసిందిగా అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, కోరారు. **ముఖ్యమైన ట్రాఫిక్ సూచనలు** ప్రజలు, కార్యకర్తలు సాధారణ వాహనాలు: బహిరంగ సభకు వచ్చే అన్ని బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ఆటోలు సందర్శకులు అందరూ తప్పనిసరిగా కాగితా జంక్షన్/రోడ్ మీదుగా కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకోవాలి.విఐపి పాస్ హోల్డర్లు కేవలం విఐపి పాస్‌లు కలిగిన వారు మాత్రమే ఉపమాక జంక్షన్ మీదుగా సభా ప్రాంగణానికి చేరుకోవాల్సి ఉంటుంది.?"ముఖ్యమంత్రి ఇతర ప్రముఖుల పర్యటన నేపథ్యంలో భద్రతా పరంగా ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. ప్రజలు ముందస్తుగా తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలి. ఎక్కడా తొందరపడకుండా, క్రమశిక్షణతో సభా ప్రాంగణానికి చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా తెలిపారు.




# ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం

## విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

- ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కరువు
- వర్షాకాలం ఈ రహదారిపై నడవాలంటే విద్యార్థులకు నరకమే
- పాఠశాల చుట్టుపక్కల ప్రాంతాలు శుభ్రపరచని మున్సిపల్ సిబ్బంది



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పటాన్‌చెరువు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి చూస్తే అభివృద్ధి అనే మాట కేవలం ప్రసంగాలకే పరిమితమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. "ప్రజా పాలన, పట్టణ ప్రగతి" అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న ప్రభుత్వ యంత్రాంగం, వాస్తవ పరిస్థితులను చూసే దృష్టి కోల్పోయిందా.? అనే సందేహం కలుగుతోంది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన పాఠశాలలు, ఇప్పుడు ప్రమాదాలకు కేంద్రాలుగా మారిపోవడం ఆందోళన కలిగించే విషయం. ప్రభుత్వాలు పాఠశాలల కోసం ఎన్ని నిధులు కేటాయించిన అభివృద్ధి మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. కార్పొరేట్ విద్యను కనుమరుగు చేసి ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తామని చెప్పడం తప్ప వాస్తవంలో ఎక్కడ కనిపించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

### స్కూలు దారి సరిగా లేదు..

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కష్టాలు చెప్పలేనివి పాఠశాలకు వెళ్లే రహదారి సక్రమంగా లేకపోవడం వల్ల చిన్నారులు రోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని బురదతో నిండిపోయే రహదారుల్లో నడవలేక విద్యార్థులు జారిపడుతూ గాయాల పాలవుతామని పుస్తకాలు, యూనిఫామ్‌లు చెడిపోవడం సాధారణమైపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా స్కూలు బయట



చెత్తాచెదారంతో నిండిపోతుంది. గతంలో మున్సిపల్ సిబ్బంది శుభ్రపరిచే వారిని ప్రస్తుతం వారు శుభ్రపరచకపోవడంతో చెత్తాచెదారం తాండవిస్తుందని విద్యార్థులకు దుర్గంధం వ్యాపిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చదువుకోవడానికి స్కూలుకు వెళ్లే పిల్లలు ఇంతటి ఇబ్బందులు పడటం నిజంగా దురదృష్టకరం.

### మూత్రశాలల ముందు ఉన్న స్థలం పరిస్థితి దారుణం..

చాలావరకు ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలల నిర్వహణ మరింత బాధాకరంగా ఉంటుంది కానీ ఇక్కడ శుభ్రత పాటిస్తున్న, బండలు లేకపోవడం వల్ల విద్యార్థులు అక్కడికి వెళ్లడానికే భయపడుతున్నారు. కొన్ని సమయాలలో రాళ్ల మొక్కలు కాళ్లకు గుచ్చుకుంటున్నాయని ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రహరీ గోడ లేక భయంతో విద్యార్థులు

పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడం మరో పెద్ద సమస్యగా మారింది. పాములు, విషపురుగులు స్కూల్ ప్రాంగణంలోకి అప్పుడప్పుడు వస్తాయని పొరపాటున ఈ విద్యార్థికైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని వాళ్ల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని సమయాలలో చిన్నారులు భయంతో వణికిపోతూ చదువు కొనసాగిస్తున్నారు. ఎప్పుడైనా ప్రమాదం సంభవించే పరిస్థితి ఉన్నప్పటికీ, బాధ్యత వహించి ప్రహరీ గోడ నిర్మించాల్సిన





అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

### ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు ఆగ్రహం..

ప్రభుత్వ పాఠశాలలపై స్థానిక ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు సమస్యలు తీర్చడానికి నిర్లక్ష్యం చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గాన్ని ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ఈ సమస్యలు కనిపించట్లేదా.? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎక్కడ పోయాయని నిలదీస్తున్నారు. పాఠశాలలు బాగుపడకపోతే అభివృద్ధి గురించి మాట్లాడటానికి అర్హత ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వానికి పాఠశాలల అభివృద్ధిపై ఆసక్తి లేదా.?

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై విద్యాశాఖ అధికారులకు సరైన దృష్టి లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. కోట్ల రూపాయల బడ్జెట్‌లు ప్రకటిస్తున్నప్పటికీ, వాటి ఫలితాలు గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో కనిపించడం లేదని విద్యార్థుల కోసం కేటాయించిన నిధులు ఎక్కడికి వెళ్తున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ప్రజా పాలన, పట్టణ ప్రగతి కార్యక్రమం కేవలం పేరుకేనా.?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన 99 రోజులప్రజా పాలన, పట్టణ ప్రగతి కార్యక్రమాల పేరుతో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నప్పటికీ, పాఠశాలల దుస్థితి మారకపోవడం ఆశ్చర్యకరం కలిగిస్తోంది. ఈ కార్యక్రమాలు నిజంగా అమలు అవుతున్నాయా.? లేక కేవలం కాగితాలపైనే పరిమితమవుతున్నాయా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు వద్ద పాఠశాలలు అంటే కేవలం భవనాలు కాదు, అవి భవిష్యత్తును నిర్మించే విద్యాలయాలు, అలాంటి చోట మౌలిక సదుపాయాలు లేకపోవడం అనేది విద్యార్థుల హక్కుల ఉల్లంఘన. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, అధికారులు వెంటనే స్పందించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## మధ్యప్రాచ్యంలో యుద్ధం

# ప్రమాదకర దశకు చేరింది

**– అన్ని పక్షాలూ సంయమనం పాటించాలని టెడ్రోస్ పిలుపు**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** మధ్యప్రాచ్యంలో యుద్ధం అత్యంత ప్రమాదకరమైన దశకు చేరుకుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌లోని నతాన్జ్ అణు కేంద్రం, ఇజ్రాయెల్‌లోని దిమోనా అణు సదుపాయం ఉన్న నగరంపై దాడులు జరిగినట్లు వచ్చిన నివేదికలతో పరిస్థితి మరింత తీవ్రంగా మారిందని ఆదివారం ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) దర్యాప్తు చేస్తోందని టెడ్రోస్ తెలిపారు. ప్రస్తుతానికి రేడియేషన్ స్థాయుల్లో ఎలాంటి అసాధారణ పెరుగుదల నమోదు కాలేదని నివేదికలు చెబుతున్నా, అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ముప్పు సృష్టిస్తుందని హెచ్చరించారు. అన్ని పక్షాలు అత్యంత సైనిక సంయమనం పాటించాలని, శాంతే ఉత్తమ ఔషధమని పిలుపునిచ్చారు. యుద్ధం శాంతిని తీసుకురాదని, రాబోయే తరాలకు ద్వేషించడానికి కొత్త కారణాలను మాత్రమే నేర్పుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అణు ప్రమాదాలు సంభవిస్తే స్పందించేందుకు ఇప్పటికే 13 దేశాల్లో తమ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా పూర్తిగా తెరవకపోతే, ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లను ధ్వంసం చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. అందులోనూ మొదట అతిపెద్ద ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని తన సోషల్ మీడియా పోస్టులలో స్పష్టం చేశారు. ఇప్పటికే ఇరాన్ నౌకాదళం, వాయుసేనతో పాటు యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ వ్యవస్థలను నిర్వీర్యం చేశామని, తమ సైనిక లక్ష్యాలకు దగ్గరగా ఉన్నామని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, హర్మూజ్ జలసంధి తెరిచే ఉందని, కానీ శత్రుదేశాలకు మాత్రం ప్రవేశం లేదని ఇరాన్ కౌంటర్ ఇచ్చింది.

## వాట్సాప్‌కు పోటీగా దేశీయ యాప్


**– భారత్‌లో 'హైప్డ్ సంవాదిని' కొత్త మెసేజింగ్ యాప్ విడుదల**

HYPED SAMVADINI

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారతదేశంలో వాట్సాప్‌కు పోటీగా మరో కొత్త స్వదేశీ మెసేజింగ్ యాప్ 'హైప్డ్ సంవాదిని' అందుబాటులోకి వచ్చింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని ఏఐసీటీఈకి చెందిన 'అనువాదిని ఏఐ' ఈ యాప్‌ను రూపొందించింది. 'హైప్డ్ సంవాదిని' పేరుతో విడుదలైన ఈ యాప్, ప్రైవసీ, భద్రత, బహుభాషా సౌలభ్యమే లక్ష్యంగా పనిచేస్తుంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్ల కోసం ఇది అందుబాటులో ఉంది. ఈ యాప్‌లో పలు ప్రత్యేకమైన భద్రతా ఫీచర్లను పొందుపరిచారు. సిమ్ స్వాప్ మోసాలను గుర్తించేందుకు 'సిమ్, డివైస్ బైండింగ్' అనే ఫీచర్‌ను జోడించారు. దీనివల్ల యూజర్ ప్రమేయం లేకుండా సిమ్ మారితే వెంటనే అప్రమత్తం చేస్తుంది. అలాగే, ఫోన్ నంబర్ షేర్ చేయకుండా 'డైనమిక్ చాట్ ఐడీల' ద్వారా ఇతరులతో కనెక్ట్ అయ్యే అవకాశం కల్పించారు. దీనివల్ల వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లదు. ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో చాట్‌లు, కాల్స్ సురక్షితంగా ఉంటాయి.భాషా పరమైన అడ్డంకులను తొలగించేందుకు ఇందులో ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఏకంగా 22 భారతీయ భాషలు, 50కి పైగా అంతర్జాతీయ భాషల్లో రియల్-టైమ్ ట్రాన్స్‌లేషన్ (తక్షణ అనువాదం) ఫీచర్ ఉంది. వాట్సాప్ నుంచి తమ పాత చాట్‌లను సులభంగా ఇందులో ఇంపోర్ట్ చేసుకోవచ్చు. మహిళలు, వృద్ధుల భద్రత కోసం వన్-ట్యాప్ ఎస్ఓఎస్ అలర్ట్, లైవ్ లొకేషన్ షేరింగ్ వంటి అదనపు ఫీచర్లు కూడా ఉన్నాయి. ఈ యాప్‌తో పాటు 'దేసి ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్'ను కూడా పరిచయం చేశారు. ఇది 22 భారతీయ భాషలకు సపోర్ట్ చేయడంతో పాటు స్మార్ట్ టైపింగ్ సలహాలు, గెస్చర్ టైపింగ్ వంటివి అందిస్తుంది. భారతీయుల అవసరాలు, భద్రతను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్‌లో 'హైప్డ్ సంవాదిని' అని సెర్చ్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ

# పేదలకు భారమా.?




- పేదలవి చిన్న ఇండ్లు దానితో నిల్వ సమస్యలు
- రవాణా చేయడం కష్టం, రవాణా ఖర్చులు ఎక్కువైతాయి
- పేదలు నిల్వ, రవాణా చేయలేక అమ్ముకునే అవకాశాలు ఎక్కువ
- మూడు నెలలు ఒకేసారి ఇస్తే మాఫియాకు పండుగే పండగ
- ప్రజలకు భారంగా మారుతున్న మూడు నెలల బియ్యం ఒకేసారి పద్ధతి

**(గౌటి రామకృష్ణ – ప్రశ్న న్యూస్)**

దేశంలో పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) కీలకమైనది. ఈ వ్యవస్థ ద్వారా కోట్లాది కుటుంబాలు ఉచితంగా రేషన్ బియ్యం పొందుతూ జీవనాధారాన్ని కొనసాగిస్తున్నాయి. అయితే ఇటీవల కొన్ని ప్రాంతాల్లో అమలులోకి తీసుకొచ్చిన "మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ" విధానం పేద ప్రజలలో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ విధానం వాస్తవానికి సౌలభ్యం కల్పించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చినా, పేదల రోజువారీ జీవితంలో ఇది భారంగా మారుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.సాధారణంగా పేద కుటుంబాల ఇళ్లు చాలా చిన్నవిగా ఉంటాయి. ఒకే గది లేదా రెండు గదులలోనే జీవనం సాగించే పరిస్థితి ఉంటుంది. ఇలాంటి కుటుంబాలకు ఒకేసారి మూడు నెలల బియ్యం నిల్వ చేయడం పెద్ద సవాలుగా మారుతోంది. బియ్యాన్ని నిల్వ చేసేందుకు సరైన స్థలం లేకపోవడం, దానిని కాపాడుకోవడంలో అనేక సమస్యలు తలెత్తడం, ఎలుకలు లేదా ఇతర పురుగుల వల్ల నష్టం కలగడం వంటి చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రజలు తాము పొందిన హక్కును సద్వినియోగం చేసుకోవడంలోనే అనేక ఇబ్బంది పడుతున్నారు.

ఇక మరో ముఖ్యమైన సమస్య రవాణా, ఒకేసారి మూడు నెలల బియ్యం తీసుకెళ్లాలంటే సుమారు 30 కిలోల నుంచి 90 కిలోల వరకు బరువు ఉంటుంది (కుటుంబ సభ్యుల సంఖ్యపై ఆధారపడి) ఈ బరువును ఒకేసారి మోసుకెళ్లడం వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు మరింత కష్టంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సదుపాయాలు చాలా తక్కువగా ఉండటం వల్ల ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. చాలా మంది ప్రజలు ఆటో, ట్రాక్టర్ లేదా ఇతర వాహనాలను అద్దెకు తీసుకోవాల్సి వస్తోంది. దీని వల్ల అదనపు ఖర్చు పడుతోంది. అంటే ఉచితంగా ఇచ్చే బియ్యం కూడా చివరికి పేదలపై ఆర్థిక భారంగా మారుతోంది.

ఈ విధానంపై విశ్లేషకులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మాఫియాకు పండుగే పండగ..

మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి ఇవ్వడం వల్ల రేషన్ మాఫియాలకు అవకాశాలు పెరుగుతున్నాయని ప్రజలు హెచ్చరిస్తున్నారు. కొంతమంది మధ్యవర్తులు పేదల వద్ద నుండి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి, దాన్ని బ్లాక్ మార్కెట్‌లో అమ్మే అవకాశాలు ఎక్కువవుతున్నాయి. పేదలు నిల్వ చేయలేక, అవసరానికి మించి ఉన్న బియ్యాన్ని అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది ప్రభుత్వ లక్ష్యానికి పూర్తిగా విరుద్ధంగా ఉంటుంది.ఇంకా ప్రతి నెల బియ్యం అందుకునే విధానం ఉండడం వల్ల ప్రజలు తమ అవసరాలను బట్టి వినియోగించుకునే అవకాశం ఉంటుంది. నెలనెలా సరఫరా జరిగితే బియ్యం తాజాగానే ఉంటాయి, నిల్వ సమస్యలు ఉండదు. కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా సంతులితంగా ఉంటుంది. కానీ మూడు నెలల సరఫరా ఒకేసారి అందితే మొదటి నెలలోనే ఎక్కువగా వినియోగించే అవకాశం ఉంటుంది. తర్వాతి నెలల్లో కొరత ఏర్పడే ప్రమాదం కూడా ఉంది.ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేయడానికి ప్రధాన కారణంగా పరిపాలనా సౌలభ్యం, రవాణా ఖర్చుల తగ్గింపు వంటి అంశాలను చూపిస్తోంది ప్రభుత్వం ఖర్చు తగ్గించుకోవడానికి చూస్తుంది కానీ అది ప్రజలకు చాలా భారం అవుతుంది. అయితే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకునేటప్పుడు పేదల వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. విధానాలు ప్రజల కోసం ఉండాలి కాని ప్రజలు విధానాల కోసం కష్టపడే పరిస్థితి రాకూడదని సామాజికవేత్తలు ప్రభుత్వానికి సూచిస్తున్నారు.

గ్రామీణ, పట్టణ పేదల మధ్య పరిస్థితులు చాలా భిన్నంగా ఉంటాయి. పట్టణాల్లో చిన్న ఇళ్లు, నిల్వ స్థలం లేకపోవడం వంటి చాలా సమస్యలు ఎక్కువగా ఉంటాయి. గ్రామాల్లో కొంతవరకు నిల్వ చేసుకునే అవకాశం ఉన్నా, అక్కడ రవాణా సమస్యలు తీవ్రమవుతాయి.

### మూడు నెలల బియ్యం ఒకేసారి వద్దు, నెల నెల ఇస్తేనే సౌకర్యం..

మూడు నెలలు ఒకేసారి ఇచ్చే పద్ధతి అన్ని ప్రాంతాల ప్రజలకు సరిపోదు. దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దీనిపై ప్రభుత్వానికి ఉన్న వాస్తవ పరిస్థితులు పూర్తిగా తెలియకపోవచ్చు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా విధానాల్లో మార్పులు చేయడం సముచితం. చాలా మంది లబ్ధిదారులు స్పష్టంగా చెబుతున్నది ఏమిటంటే "మాకు నెలనెలా బియ్యం ఇస్తేనే సౌకర్యంగా ఉంటుంది" అని.సామాజిక న్యాయం, ఆహార భద్రత అనే రెండు ముఖ్య లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలి. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వడం వల్ల ఈ రెండు లక్ష్యాలను దెబ్బతీసే అవకాశాలు చాలా ఉన్నాయి.

ముఖ్యంగా పేదలపై మానసిక, ఆర్థిక ఒత్తిడి పెరుగుతోంది.మొత్తానికి చూస్తే, మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ విధానం కాగితాలపై సౌలభ్యంగా కనిపించినా, వాస్తవానికి మాత్రం అనేక సమస్యలకు కారణమవుతోంది. పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, వారి జీవనశైలికి అనుగుణంగా విధానాలు ఉండాలి. నెలనెలా రేషన్ బియ్యం పంపిణీ పద్ధతినే కొనసాగించడం ద్వారా ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని విశ్లేషకులు సూచిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం తీసుకునే ప్రతి నిర్ణయం నిజంగా వారికి ఉపయోగపడేలా ఉండాలి. అదే మంచి పాలనకు నిదర్శనం.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588